డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి-03 సంచిక-09
మార్చి - 2023 పేజీలు - 44












శోభకృత్ నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలతో...




# రాగిలో అగ్గి తెగులు



అగ్గి తెగులు రాగి పంటకు మూడు దశలలో సోకుతుంది.

ఎదిగిన మొక్కల ఆకులపై చిన్న చిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడి నూలు కండె ఆకారంలోకి మారతాయి. మచ్చల అంచులు ముదురు గోధుమ రంగులో ఉండి మధ్య భాగం బూడిద రంగులో కనబడుతుంది. తెగులు పెరిగేకొద్దీ ఆకులు ఎండిపోయి



**ఆకులపై అగ్గి తెగులు సోకిన లక్షణాలు**

పంట మొత్తం కాలిపోయినట్లు కనిపించడం వలన ఈ తెగులుకు అగ్గితెగులు అని పేరు. తెగులు కంకుల మెడభాగంపై ఆశించినపుడు నష్టం అధికంగా ఉంటుంది. తెగులు ఆశించిన భాగంలో కణజాలం నల్లగా మారి కుళ్ళిపోవడం వలన మెడవద్ద విరిగి వెన్నులు క్రిందికి వాలిపోతాయి. ఫలితంగా వెన్ను భాగానికి ఆహార పదార్థాల సరఫరా ఆగిపోయి తాలుగింజలు ఏర్పడతాయి. తెగులు వెన్నులపై ఆశించినపుడు రెక్కలు నల్లగా మారి గింజకట్టకుండా ఉండిపోతాయి.

**నివారణ చర్యలు :** తెగులు తట్టుకునే రకాలైన శ్రీచైతన్య, వేదావతి, ఇంద్రావతి, సువర్ణముఖి, వకుళ మరియు తిరుమల రకాలను ఎన్నుకోవాలి. శిలీంద్రం కలుపు మొక్కలపై జీవిస్తుంది. కావున గట్లపై మరియు పొలంలో కలుపు లేకుండా జాగ్రత్తపడాలి. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదుకు మించి వాడరాదు. నారు నాటేముందు బ్లైటాక్స్ లేదా మాంకోజబ్ మందును మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి ఆ ద్రావణంలో నారును ముంచి శుద్ధి చేసుకోవాలి. వెదజల్లే పద్ధతిలో 2 గ్రాముల ట్రై సైక్లోజోల్ కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో మొక్కలు పసుపు రంగుకు మారి గుంపులుగా ఎండిపోతుంటే వెంటనే లీటరు నీటికి కార్బండిజమ్ 1 గ్రాము కలిపి నారుమడిపైన వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. మొక్కలపై అక్కడక్కడ మచ్చలు కనిపించినప్పుడు లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజమ్ లేదా 5 గ్రా. ట్రైసైక్లోజోల్ మందును కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.




**మెడభాగం, రెక్కలపై అగ్గితెగులు లక్షణాలు**

డా. షేక్ అబ్దుల్ సలామ్, డా. వై. సంధ్యారాణి,
డా. యు. త్రివేణి, డా. ఎన్. అనూరాధ,
వ్యవసాయ పరిశోధనా స్థానం, విజయనగరం






ప్రధాన సంపాదకులు
**శ్రీ చేవూరు హరికిరణ్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ స్పెషల్ కమీషనర్



సంపాదకులు
**శ్రీ వల్లూరి శ్రీధర్**
జాయింట్ డైరెక్టర్, ఆర్.బి.కె.

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**శ్రీ డి. వెంకటేశ్వర్లు,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** ఏడిఎ
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ

*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com


డా. వైఎస్ఆర్ రైతు భరోసా సంచిక డిజిటల్ ఎడిషన్ apagrisnet.gov.in అందుబాటులో ఉంది

## విషయసూచిక

మార్చి - 2023

సంపాదకీయం


| | | |
|---|---|---|
| 1. | రైతుపై మమకారం, వ్యవసాయం అంటే ప్రేమ | 5 |
| 2. | రైతుల సేవలో జీవ నియంత్రణ ప్రయోగశాలలు | 6 |
| 3. | నువ్వుల సాగులో మెలకువలు | 8 |
| 4. | మొక్కజొన్నలో యాజమాన్యం | 10 |
| 5. | తక్కువలో ఎక్కువ దిగుబడినిచ్చే‘ వరిగ | 12 |
| 6. | చిరుధాన్యాలతో రుచికర వంటకాలు | 14 |
| 7. | సులువుగా మల్బరీ పెంపకం | 15 |
| 8. | వేసవిలో ఆకుకూరల సాగు | 16 |
| 9. | ఆరోగ్యానికి అండగా దొండ | 18 |
| 10. | నత్తే కదా! అనుకుంటే పంట గుల్లే | 20 |
| 11. | మిరపలో కోత ముందు, తరువాత జాగ్రత్తలు | 22 |
| 12. | చిత్రమాలిక | 23 |
| 13. | పుచ్చ, ఖర్భుజాల్లో తెగుళ్ల నివారణ | 24 |
| 14. | నాణ్యమైన దిగుబడికి ముఖ్యమైన చర్యలు | 26 |
| 15. | అల్లుకుని కాసే ఆగాకర | 28 |
| 16. | తక్కువ ఖర్చుతో అధిక రాబడినిచ్చే సపోట | 30 |
| 17. | అధిక సూక్ష్మ పోషకాల చేమ | 32 |
| 18. | వర్టికల్ ఫార్మింగ్ | 34 |
| 19. | డ్రాగన్ ఫ్రూట్ + శ్రీగంధం సాగు | 36 |
| 20. | రైతుల సందేహాలు - సమాధానాలు | 37 |
| 21. | సందేహాలు - సమాధానాలు | 39 |
| 22. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 23. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |







డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా - రూ.300/- యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. 069610100200430 కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు



## సంపాదకీయం

# రైతు ఇంట ఉగాది ఉషస్సులు..

ఉగాది ఉషస్సులు.. ఆరు రుచుల సమ్మేళనాలు... అపరాలు, వరి, వేరుశనగ, ప్రత్తి, మిరప, చిరుధాన్యాలు అధిక దిగుబడులు.. రైతు ఇంట సంతోషాలు.. వెళ్లిపోయిన శుభకృత నామ సంవత్సరం రాష్ట్రానికి, రైతాంగానికి శుభాలనే చేకూర్చింది ప్రకృతి సహకరించింది.. వానలు సమృద్ధిగా కురిశాయి జలాశయాలు నిండుకుండల్లా ఉన్నాయి. వరసగా రెండో ఖరీఫ్ పంటకాలం రికార్డు స్థాయి పంట దిగుబడులు తెచ్చింది.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం శోభకృత్ నామ సంవత్సరం అన్నదాతలకు రెట్టింపు సంతోషాలు తేవాలని కోరుకుంటోంది. ఈ ఆశయంతోనే క్రమం తప్పకుండా రైతుల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సాయం చేస్తూనే ఉంది. అది కూడా ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా ప్రణాళికా యుతంగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా పెట్టుబడి రాయితీ, రైతుభరోసా, పంటలబీమా, సున్నావడ్డీ రూపేణా సొమ్మును జమ చేస్తోంది. దీని వల్ల పంట సాగుచేస్తున్న ప్రతి రైతు అర్హుడైతే చాలు. ఈ క్రాప్ నమోదు చేసుకున్నంతనే సంక్షేమ ఫలం అందుతోంది. ఇది మునుపెన్నడూ జరగనిది, కించిత్తు అవినీతికి ఆస్కారం లేనిది.


రైతుల అవసరాలు తీర్చేందుకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను పటిష్టం చేస్తూనే ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకేస్తోంది. కర్షకులకు పెట్టుబడి వ్యయం తగ్గించి అధిక దిగుబడులతో సుస్థిర నికర రాబడి పెంపునకు సాంకేతిక దన్ను అందిస్తోంది. గత ఏడాది జూన్ లో రూ 691 కోట్లతో డా వై ఎస్ ఆర్ యంత్ర సేవ పథకం క్రింద దాదాపు వెయ్యి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం మరో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుడుతోంది. అవే కిసాన్ డ్రోన్లు.. వ్యవసాయంలో వాటి వినియోగం పెరిగితే అనూహ్య ఫలితాలు వస్తాయని నమ్ముతోంది. 2023-24 సంవత్సరంలో ఏకంగా 2,000 డ్రోన్లను రైతులకు సబ్సిడీ పై పంపిణీ చేయాలనీ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అవసరమైన పూర్వ రంగాన్ని ఇప్పటికే సిద్ధం చేసింది ఈ డ్రోన్ల నిర్వహణకు అవసరమైన పైలెట్ శిక్షణ ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆరంభించింది. దేశంలో ఈ తరహా శిక్షణను రైతులకు ఇచ్చిన మొదటి రాష్ట్రంగా నిలుస్తోంది. అంతే కాకుండా రానున్న మూడు నాలుగు నెలల్లో 500 డ్రోన్లతో పొలాల్లో వ్యవసాయం చేయించాలని తీవ్రంగా కృషి చేస్తోంది. అంతేకాకుండా గ్రామీణ నిరుద్యోగ వ్యవసాయ పట్టభద్రులకు, పాలిటెక్నిక్ చదివిన యువతకు ఉచితంగా డ్రోన్ పైలెట్ శిక్షణ ఇప్పించి రైతు భరోసా కేంద్రాలతో సమన్వయం చేయనుంది. ఇది సన్న, చిన్నకారు రైతులకే కాకుండా యువతకు కూడా బహువిధాల ప్రయోజనకారి కాగలదు.

రైతులకు అవసరమైన వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు కూడా ఇవ్వనుంది టార్పాలిన్లు, స్ప్రేయర్లు వంటివి ఇవ్వడం వల్ల రైతు బృందాలకే కాకుండా వ్యక్తిగతంగా లబ్ధి కలగనుంది

ఇప్పటి వరకు గత నాలుగేళ్లలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యం సంభవించినా నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకుంటోంది. ఎలాంటి విపత్తులతో పంట నష్టపోయినా, వారికి గరిష్టంగా నాలుగు నెలల లోపే పరిహారం ఇచ్చి బాధితులకు భరోసా ఇచ్చింది ఇలా మాటకు కట్టుబడి, చెప్పినవి, చెప్పనివి రైతులకు అందిస్తూ రైతు సంక్షేమానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చేతల్లో ఆచరించి చూపిస్తోంది.

# రైతుపై మమకారం, వ్యవసాయం అంటే ప్రేమ

## తెనాలి రైతు భరోసా - పి.ఎం. కిసాన్ సాయం విడుదల సభలో ముఖ్యమంత్రి జగన్




- దేవుడి దయ వల్ల వరుసగా నాలుగవ ఏడాది మూడవ విడత రైతు భరోసా - పి.ఎం. కిసాన్ సాయం విడుదల చేస్తున్నాం.
- మనందరి ప్రభుత్వంలో మీ బిడ్డగా చెబుతున్నా. నాకు రైతులంటే మమకారం. వ్యవసాయం అంటే ప్రేమ. అందుకే రైతులకు ఏది కావాలన్నా చేద్దామంటాను.
- అందుకే ఫిబ్రవరి 28న మూడవ విడత ఆర్థిక సాయం 51.12 లక్షల రైతు కుటుంబాలకు రూ. 1090.76 కోట్లు అందిస్తున్నాం.
- 2019 నుండి ఇప్పటి వరకు ఈ పథకం క్రింద మొత్తం రూ.27062.09 కోట్ల ఆర్థిక సాయాన్ని అర్హులైన 52.38 లక్షల రైతు కుటుంబాలకు అందించాం.
- ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు అదే పంట కాలంలో రైతులను ఆదుకోవాలని మన ప్రభుత్వం నిర్ణయించింది.
- డిశంబరులో సంభవించిన మాండూస్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులు 91237 మందికి పెట్టుబడి రాయితీ సొమ్ము క్రింద రూ. 76.99 కోట్లను ఈరోజు నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేస్తున్నాం.
- మొత్తంగా 2019-20 నుండి ఇప్పటి వరకు వివిధ రకాల ప్రకృతి విపత్తుల వలన నష్టపోయిన 22.22 లక్షల వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ము రూ. 1911.79 కోట్లు విడుదల చేశాం.
- దేశంలో కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే పూర్తి ఉచితంగా రైతులు ఒక్క రూపాయి కూడా కట్టనక్కర లేకుండా ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పిస్తోంది.
- సాగు చేసిన ప్రతి ఎకరాన్ని రైతుపై ఏమాత్రం ఆర్థిక భారం లేకుండా పంటలకు బీమా రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో డా. వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా పథకం ఖరీఫ్ 2020 నుంచి కేవలం ఈ-క్రాప్ ఆధారంగా ఎంపిక చేసిన పంటలకు అందజేస్తున్నాం.
- జూన్ 2019 నుంచి ఖరీఫ్ 2021 పంట కాలం వరకు మొత్తం రూ. 6684.84 కోట్ల పంటల బీమా పరిహారం సొమ్మును 44.28 లక్షల మంది రైతులకు చెల్లించాం.

**-తెనాలి సభలో ముఖ్యమంత్రి జగన్**

# రైతుల సేవలో జీవ నియంత్రణ ప్రయోగశాలలు




పంట సాగులో తెగుళ్ల బెడద అంతా ఇంతా కాదు. ఒక్కోసారి పంట మొత్తం నష్ట పోవాల్సి వస్తుంది. ఇటీవల మిరప పంట నల్ల తామర పురుగు బారిన పడి బాగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. అలాగే వేరుకుళ్ళు తెగులు కూడా తీవ్రంగా నష్ట పరిచిన సంగతి తెలియంది కాదు. ఇలాంటి తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులకు మేలయిన మార్గం.. జీవ శిలీంద్రనాశినులు.. ట్రైకోడెర్మా విరిడి.. దీన్ని వాడడం వల్ల 60 నుంచి 80 శాతం వరకు పంటల్లో తెగుళ్ళ తీవ్రతను తగ్గించవచ్చు. అంతేకాకుండా వ్యాధి కారకాలు మొక్కల వేర్లను ఆశించకుండా కాపాడుకోవచ్చు. మరి ఈ జీవ శిలీంద్రనాశిని.. (ట్రైకోడెర్మా విరిడి)... ఎక్కడ దొరుకుతుంది. మన రాష్ట్రంలో ప్రభుత్వమే 11 ప్రాంతాల్లో జీవ నియంత్రణ ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. ఇవి గత దశాబ్ద కాలంగా రైతులకు విశేష సేవలు అందిస్తున్నాయి. అందులో ప్రథమంగా చెప్పుకోదగ్గది గుంటూరు లామ్ లోని జీవ నియంత్రణ ప్రయోగశాల.. ఇది జూన్ 2011 నుంచి ఇప్పటివరకు లక్షల మంది రైతులకు శ్రేష్ఠమైన జీవ శిలీంద్ర నాశినులను ఉత్పత్తి చేసి అందిస్తూ వీటి అమ్మకాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ఈ ప్రయోగశాల ఇన్‌ఛార్జిగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఐ. సునీత వ్యవహ రిస్తున్నారు. ఇక్కడ తయారయ్యే ట్రైకోడెర్మా విరిడి, సూడో మోనాస్ ఫ్లోరెసెన్స్‌ల ఉపయోగాలు, వాడే పద్ధతుల గురించి ఆమె వివరించారు. ఈ ప్రయోగశాల గత పన్నెండు సంవత్సరాల్లో సాధించిన ప్రగతి వివరించారు. ఇక్కడ ఆమెతో పాటు ఇద్దరు ఏఓలు, ఇద్దరు ఏఈఓలు, ఒక సీనియర్ సహాయకుడు పనిచేస్తున్నారు.

ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఈ ప్రయోగశాలల్లో రైతులకు సరసమయిన ధరలకు జీవ శిలీంద్ర నాశినులను సకాలంలో అందుబాటులో ఉంచుతున్నాయి. ముందుగా

### ట్రైకో డెర్మా విరిడి గురించి తెలుసుకుందాం

**భూమిలో వేసే విధానం :** ఒక ఎకరానికి 4 కిలోల ట్రైకోడెర్మా విరిడిని 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి మిశ్రమంతో కలిపి చల్లుకోవాలి.

**విత్తన శుద్ధి :** కిలో విత్తనానికి పది గ్రాముల పొడిమందు కలిపి శుద్ధి చేసుకోవాలి.

**మొక్క మొదళ్ళు తడపడం:** ఐదు గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని ఒక లీటరు నీటికి కలిపి తడపాలి.

**పండ్ల తోటలకు:** మొక్కకు 30–50 గ్రా వంతున ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేయాలి.

**వాడకంలో జాగ్రత్తలు :** రసాయనిక ఎరువులు, పురుగు మందులతో కలిపి వాడరాదు. చల్లని పొడి ప్రదేశంలో ఉంచాలి.

రాయితీపై పొందడానికి సమీప మండల వ్యవసాయాధి కారిని సంప్రదించాలి.

**సిఫార్సు చేసిన పంటలు.. తెగుళ్ల వివరాలు :** పత్తి, అపరాలు, మిరప పంటల్లో వచ్చే వేరుకుళ్ళు, వడలు తెగుళ్ళకు,



జీవ నియంత్రణ ప్రయోగశాల, లాం, గుంటూరు 2011-12 నుండి 2021-22 వరకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన వివరాలు

| వరుస నెం. | సంవత్సరం | సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ (పరిమాణం కిలోలలో) | | ట్రైకోడెర్మా విరిడి (పరిమాణం కిలోలలో) | | మొత్తం (పరిమాణం కిలోలలో) | |
|---|---|---|---|---|---|---|---|
| | | లక్ష్యం | సాధించినది | లక్ష్యం | సాధించినది | లక్ష్యం | సాధించినది |
| 1 | 2011-12 | 4,000 | 3,734 | 1,500 | 3,502 | 5,500 | 7,236 |
| 2 | 2012-13 | 4,000 | 4,983 | 1,500 | 5,478 | 5,500 | 10,461 |
| 3 | 2013-14 | 10,000 | 3,600 | 10,000 | 27,500 | 20,000 | 31,100 |
| 4 | 2014-15 | 10,000 | 9,000 | 20,000 | 26,500 | 30,000 | 35,500 |
| 5 | 2015-16 | 10,000 | 12,500 | 20,000 | 61,000 | 30,000 | 73,500 |
| 6 | 2016-17 | 10,000 | 9,000 | 20,000 | 80,500 | 30,000 | 89,500 |
| 7 | 2017-18 | 10,000 | 17,500 | 40,000 | 72,047 | 50,000 | 89,547 |
| 8 | 2018-19 | 10,000 | 10,600 | 40,000 | 47,500 | 50,000 | 58,100 |
| 9 | 2019-20 | 10,000 | 6,823 | 40,000 | 54,771 | 50,000 | 61,594 |
| 10 | 2020-21 | 10,000 | 21,587 | 40,000 | 82,825 | 50,000 | 1,04,412 |
| 11 | 2021-22 | 20,000 | 23,371 | 80,000 | 84,888 | 1,00,000 | 1,08,259 |

వేరుశెనగ లో కాండంకుళ్ళు, మొక్కజొన్నలో వడలు తెగుళ్లకు, అరటి, పసుపు, అల్లం సాగులో దుంప వేరుకుళ్ళు, వడలు తెగుళ్ళకు, చెరుకులో ఎర్రకుళ్ళు తెగుళ్ళకు, పందిరి కూరగాయల సాగులో వచ్చే ఎండు తెగుళ్ళకు, పొగాకు, కాలీఫ్లవర్, క్యాబేజిలో వచ్చే మాగుడు తెగుళ్ళకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

**సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ (బ్యాక్టీరియా జాతి):** వేరు ఆకుల కణ వ్యవస్థ ద్వారా మొక్కలో అన్ని భాగాలకు వ్యాపిస్తుంది.

ప్రతిఘటించు శక్తి వల్ల యాంటిబయోటిక్స్ తయారు చేసి మొక్కలలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

కైటినస్ అనే ఎంజైము విడుదల చేసి తెగుళ్ళను నాశనం చేస్తుంది.

మొక్కలకు లభ్యం కాని భాస్వరాన్ని అందిస్తుంది. పెరుగుదలను ప్రోత్సహించే రైజో బ్యాక్టీరియాగా ఉపయోగపడుతుంది.

పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టి రసాయన అవశేష రహిత ఉత్పత్తులు అందించడానికి తోడ్పడుతుంది.

అగ్గితెగులు, పొడతెగులు వంటి తెగుళ్ళను సమర్ధవంతంగా అరికడుతుంది.

**ఉపయోగించే పద్ధతులు :** ఒక ఎకరానికి 2 కిలోల సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్,90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి లేక ఇసుక మిశ్రమం కలిపి చల్లుకోవాలి.

**విత్తన శుద్ధి :** కిలో విత్తనానికి పది గ్రాములు కలిపి శుద్ధి చేసుకోవాలి.

**వేళ్ళను శుద్ధి చేయడం:** నారువేళ్ళను సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ ద్రావణంలో (5 గ్రాములు ఒక లీటరు నీటికి కొద్దిగా నల్లమట్టిని జిగటగా వచ్చేవరకు కలిపి) ముంచి నాటాలి.

**పిచికారీ :** ఒక కిలో సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



**ఐ. సునీత, ఎ.డి.ఎ., ఇన్‌ఛార్జ్, బి.సి. ల్యాబ్, లాం, గుంటూరు. ఫోన్ : 83310 56998**

# నువ్వుల సాగులో మెలకువలు







మన రాష్ట్రంలో పండిస్తున్న నువ్వుల పంటలో అధిక దిగుబడి సాధించటానికి ఎదురవుతున్న దిగుబడి అవరోధాలు వాటిని అధిగమించటానికి పరిష్కార మార్గాలను తెలుసుకుందాం.

**1. సరైన రకాలను సాగు చేయకపోవటం:**
చాలా ప్రాంతాలలో రైతులు నువ్వుల పంటను తొలకరికి ముందు వేసవిలో ఒక బోనస్ పంటగా సాగు చేస్తున్నారు. మేలైన రకాల ఎంపికపై అంతగా దృష్టి సారించటం లేదు. అధిక దిగుబడినిచ్చు రకాలను సాగు చేసినట్లయితే నువ్వు పంటలో మంచి దిగుబడులను సాధించవచ్చు.

**పరిష్కారం:** యలమంచిలి-66, యలమంచిలి-11, యలమంచిలి-17 లాంటి అధిక దిగుబడులనిచ్చు రకాలను సాగు చేసుకోవాలి.

**2. సరైన ఎరువుల యాజమాన్యాన్ని పాటించకపోవటం:** నువ్వుల సాగులో రైతులు సేంద్రీయ ఎరువులను వాడకపోవటంతో పాటు, అరకొరగా రసాయనిక ఎరువులను వినియోగించటం, కొన్ని సందర్భాలలో అసలు ఎరువుల్నే వాడకుండా పంటను సాగు చేస్తున్నారు. దీని మూలంగా దిగుబడులు తగ్గడంతో పాటు, సేంద్రీయ ఎరువులు వాడని కారణంగా భూసారం దెబ్బతిని, చీడ పీడల సమస్య పెరగటం జరుగుతుంది.

**పరిష్కారం:** ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఎకరాకు 16 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి.
సగం నత్రజని, మొత్తం భాస్వరం మరియు మొత్తం పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలి. మిగతా సగం నత్రజని ఎరువును విత్తిన నెల రోజులకు కలుపు తీసి వేసుకోవాలి.

**3. విత్తన శుద్ధి పాటించకపోవుట:** విత్తన శుద్ధి పాటించకపోవుట వలన వేరుకుళ్ళు, కాండంకుళ్ళు, ఆల్టర్నేరియా ఆకుమచ్చ లాంటి తెగుళ్ళు వ్యాప్తి జరిగి, పంటకు నష్టం వాటిల్లుతుంది.

**పరిష్కారం:** ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరం/కాప్టాన్/మాంకోజెబ్‌లో విత్తన శుద్ధి చేయాలి. ఇమిడాక్లోప్రిడ్ మందు 1 కిలో విత్తనానికి 5 గ్రా. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**4. అధిక విత్తన మోతాదును వినియోగించుట:** అవసరానికి మించి ఎక్కువ మోతాదులో విత్తనాలను వాడినట్లయితే, విత్తనం

వృధా అవుతుంది, మొక్కలు ఒత్తుగా ఉండుట వలన చీడ పీడల సమస్యలు పెరుగుతాయి.

**పరిష్కారం:** ఎకరాకు 2.5 కిలోల విత్తనాలను సమపాళ్ళలో ఇసుక లేదా నూకలు కలిపి గొర్రుతో వరుసలలో విత్తుకోవాలి.

**5. కలుపు యాజమాన్యాన్ని పాటించకపోవుట:** నువ్వుల సాగులో కలుపు సమస్య ఒక కీలకమైన అవరోధంగా భావించాలి. సకాలంలో కలుపును సమర్ధవంతంగా నివారించనట్లయితే, అది దిగుబడులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

**పరిష్కారం:** విత్తనం విత్తిన వెంటనే పెండిమిథాలిన్ లేదా అలాక్లోర్ మందును ఒక లీటరు నీటికి 4-5 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ



చేయాలి. మొక్కలు మొలిచిన 15 రోజులకు అదనపు మొక్కలను తీసి వేయాలి. విత్తిన 20-25 రోజుల మధ్య గొర్రుతో అంతర కృషి చేయాలి.

**6. నీటి యాజమాన్యం:** రబీ, వేసవిలో వేసే నువ్వుల పంటలో నీటి తడులను తప్పని సరిగా ఇవ్వాలి.

**పరిష్కారం:** విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వాలి. పూత, కాయ గింజకట్టు దశల్లో తప్పని సరిగా తడులు ఇవ్వాలి. విత్తిన 35-40 రోజుల నుండి 55-60 రోజుల వరకూ నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

**7. వెర్రి తెగులు (ఫిల్లోడి):** నువ్వుల పంటను ఎక్కువగా ఆశించి నష్టపరిచే తెగుళ్ళలో వెర్రి తెగులు ముఖ్యమైనది.

**పరిష్కారం:** తెగులును తట్టుకునే యలమంచిలి-66 రకాన్ని సాగు చేయాలి. తెగులు కనిపించిన వెంటనే తెగులు సోకిన మొక్కలను



పీకి తగుల బెట్టాలి. వైరస్ వ్యాప్తికి కారణమైన దీపపు పురుగులను నివారించుటకు ఒక లీటరు నీటికి 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.3 గ్రా. అసిటామిప్రైడ్ లేదా 0.3 గ్రా. థయోమిథాక్సమ్ మందును కలిపి పిచికారీ చేయాలి.

**8. ఆకు ముడత, కాయతొలుచు పురుగు:**

**పరిష్కారం:** ఆకులలో గూడు కట్టుకుని ఉన్న గొంగళి పురుగులను ఏరి నాశనం చేయాలి. ఒక లీటరు నీటికి 5 శాతం వేప గింజల కషాయం లేదా ప్రొఫినోఫాస్ 2.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.2 మి.లీ, లేదా ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ, లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



# మొక్కజొన్నలో యాజమాన్యం




మొక్కజొన్న పంటను ఆశించే కొన్ని చీడపీడలను సరైన సమయంలో గుర్తించి, తగిన సస్యరక్షణ చర్యలను చేపట్టినట్లైతే నాణ్యమైన లాభసాటి పంటను సాధించవచ్చు.

**కాండం తొలుచు పురుగు:** ఇవి రెండు రకాలు. 1) మచ్చలు లేక చారల కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఖరీఫ్ పైరును ఆశిస్తుంది. 2) గులాబి రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా రబీ మొక్కజొన్నను ఆశిస్తుంది. ఇవి పైరు మొలకెత్తిన 10-20 రోజుల నుండి ఆశిస్తాయి. తల్లి పురుగు 2-3 వరుసల్లో ఆకు మొదలు, కాండం మధ్యభాగంలో ముత్యాల వంటి గ్రుడ్లను 7-20 రోజులలో పెడుతుంది. ఒక సముదాయంలో 30-100 గ్రుడ్లు ఉంటాయి. వారం రోజుల్లో గ్రుడ్లు పగిలి పిల్ల పురుగులు మొదట ఆకుల పైన పత్ర హరితాన్ని గోకి తింటాయి. తర్వాత కాండాన్ని తొలిచి లోపలికి ప్రవేశించి అంకురాన్ని తింటాయి. ఆకులు విచ్చుకున్న తర్వాత గుండు సూది మాదిరి రంధ్రాలు లేదా అగ్గిపుల్ల మందం పొడవాటి చిల్లులను వరుసల్లో గమనించవచ్చు. కాండం లోపల "S" ఆకారంలో సొరంగాలు ఏర్పడతాయి. మొవ్వును ఆశించి అంకురాన్ని తినడం వలన మొవ్వు ఎండిపోయి, చనిపోతుంది. దీనినే 'డెడ్ హార్ట్' అని అంటారు. ఈ పురుగు పూతను కండెను ఆశించడం వలన దిగుబడి తగ్గిపోతుంది.



**సమగ్ర సస్యరక్షణ:** పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.కాండం తొలుచు పురుగు నివారణకు ఎర పంటగా జొన్న పైరును 3-4 వరుసల్లో మొక్కజొన్న చుట్టూ విత్తుకుంటే పురుగు జొన్నకు ఆకర్షింపబడుతుంది. జొన్నను 45 రోజుల తరువాత తీసివేయాలి. అంతర పంటలుగా అపరాలు (కంది, చిక్కుడు, బొబ్బర్లు) సాగు చేసి సహజ శత్రువుల సంఖ్యను పెంపొందించాలి. ఈ పురుగు గ్రుడ్లపై పరాన్నజీవి అయినటు వంటి ట్రైకోగ్రామా కిలోనిస్ కార్డులను ఎకరాకు 2-3 చొప్పున రెండు విడతలుగా 12, 22 రోజుల పైరు దశలలో విడుదల చేయాలి. నత్రజని, భాస్వరం మరియు పొటాష్ ఎరువులను సమపాళ్ళలో పంటకు అందించాలి. క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే పురుగు ఉధృతిని బట్టి 25-30 రోజుల మధ్య కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున ఆకుల సుడులలో వేయాలి.



**కత్తెర పురుగు:** గుర్తింపు చిహ్నాలు: గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన "Y" ఆకారంలో తెల్లని చారను ఉదర భాగంలో ఆఖరి ఖండితంపై నల్లటి 4 చుక్కలు చతురస్రాకారంలో (::) ఉంటాయి.

**నష్ట పరుచు విధానం:** మొదటి దశ గొంగళి పురుగు ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుంది. గొంగళి పురుగు పెరిగేకొద్దీ ఆకుల చివరల నుండి కత్తిరించినట్లుగా పూర్తిగా తినివేయుట గమనించవచ్చు. ఆకు సుడులను, కాండాన్ని కూడా తొలిచి రంధ్రాలను చేసి పంటను




నష్టపరుస్తుంది. మొక్క జొన్న కంకి లేత కండె భాగాన్ని కూడా తిని నష్టపరుస్తుంది.

**సమగ్ర సస్యరక్షణ :** పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. గ్రుడ్ల సముదాయాలను గుర్తించి ఏరి నాశనం చేయాలి. గ్రుడ్లను ఆశించే ట్రైకోగ్రామా బదనికలను ఎకరానికి 20,000 చొప్పున పొలంలో విడుదల చేయాలి. గ్రుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటరు వేప నూనెను పిచికారీ చేయాలి. తొలి దశ గొంగళి పురుగులను నివారించుటకు ఎకరానికి 500 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 400 మి.లీ. క్వినాల్ఫాస్ మందులను పిచికారీ చేసుకోవాలి. గొంగళి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా. లేదా స్పైనోసాడ్ 60 మి.లీ. ఎకరానికి సుడులు లేదా మొవ్వు లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి. అవసరాన్ని బట్టి 2 నుండి 3 సార్లు మందును పిచికారీ చేయాలి. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం 2 లీటర్ల నీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టి, ఆ మిశ్రమానికి 100 గ్రా. థయోడికార్బ్ లేదా లీటరు క్లోరిపైరిఫాస్ మందును జోడించి సాయంత్రం వేళల్లో సుడులు / మొవ్వులో వేయాలి.

ఈ పురుగు ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, సరైన యాజమాన్య పద్ధతులను సరైన సమయంలో పాటించి, దీని యొక్క ఉధృతిని, నష్టాన్ని నివారించుకోవచ్చు.

**పేనుబంక:** మొక్కజొన్న పంట బెట్టకు గురి అయినప్పుడు పేనుబంక ఉధృతి చాలా ఎక్కువగా కనిపిస్తుంది. అనుకూల వాతావరణంలో జీవిత కాలం వారం రోజుల్లో పూర్తవుతుంది. ఇవి ఎక్కువగా 30-60 రోజుల వయసున్న పైరును ఆశిస్తాయి. తల్లి పిల్ల పురుగులు ఆకులు మరియు లేత కాండం నుండి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు వాడి, పసుపు రంగుకు మారి ముడుచుకు పోతాయి. మొక్కజొన్న లేత దశలో పేనుబంక ఆశిస్తే ఎదుగుదల ఆగిపోతుంది. ఈ పురుగులు తేనె లాంటి జిగురు పదార్థాన్ని విసర్జించడం వల్ల శిలీంద్రాలు సోకి మసి తెగులు ఆశించి కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి, దిగుబడి తగ్గుతుంది. తేనె వంటి పదార్థం కోసం తిరిగే చీమలను బట్టి ఈ పురుగు ఆశించినట్లు తెలుసుకోవచ్చు.



**నివారణ :** పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రా. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పేనుబంకను సహజంగా అక్షింతల పురుగులు, అదుపులో ఉంచుతాయి.



డా. కె. రేవతి, డా. ఎం. వెంకట లక్ష్మి,
డా. బి. నవీన్, డా. వి. మంజువాణి,
జె.యశ్వంత్ కుమార్, జి. కృష్ణ వేణి
డా. పి. శ్రీలత
కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల,
కృష్ణా జిల్లా 521 133

# తక్కువలో ఎక్కువ దిగుబడినిచ్చే ‘ వరిగ ’



వరిగ చిరుధాన్యాలలో ఒక ముఖ్యమైన పంట. ఇది తక్కువ పంట కాలం కలిగి ఉండటం వలన నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. దీనికి నీటి వినియోగం చాలా తక్కువ అందువలన నీటి ఎద్దడి గల ప్రాంతాలలో సాగుకు అనుకూలం. సాగు నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలలో దీనిని వేసవి పంటగా పండించవచ్చు. దీని పంట కాలం అతి తక్కువగా ఉండటం వలన దీనిని సాంద్ర వ్యవసాయంలో విరివిగా వినియోగించవచ్చు. ఇది మన రాష్ట్రంలో 0.4 లక్షల హెక్టార్లలో సాగు చేయబడుతుంది. దిగుబడి 0.22 లక్షల టన్నుల వరకు ఉండి ఉత్పాదకత 531 కిలో/హెక్టారుకు ఉంటుంది. మన రాష్ట్రంలో అతి స్వల్ప విస్తీర్ణంలో ఉత్తర కోస్తా, ఎత్తైన గిరిజన మండలాల్లో వర్షాధారంగా సాగు చేస్తున్నారు.

గ్లుటిన్ అనే పదార్థం వరిగలో తక్కువగా ఉంటుంది. కానీ పిండిపదార్థాలు, క్రొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. మెగ్నీషియం, మాంగనీస్, ఫాస్పరస్ వంటి అనేక ఖనిజ లవణాలు అధికంగా ఉంటాయి. విటమిన్ B6, ఇనుము అధికంగా ఉంటాయి. ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది. పీచు పదార్థ శాతం అధికంగా ఉండి, ఊబకాయాన్ని నియంత్రిస్తుంది. వరిగలలో మాంస కృత్తులు వరి కన్నా ఎక్కువగా గోధుమలతో సమానంగా ఉంటాయి.

వరిగలు 60–90 రోజులకు పంట చేతికి వస్తుంది. వరిగ పంట అధిక ఉష్ణోగ్రతను, నీటి ఎద్దడిని బాగా తట్టుకుంటుంది. ఈ పంటను ప్రతికూల వాతావరణం, తక్కువ సారవంతమైన నేలల్లో పండించినప్పటికీ మంచి దిగుబడి వస్తుంది.

**నేలలు:** వరిగ సాగుకు నీరు నిల్వ ఉండని అన్ని నేలలు అనుకూలం. తేలిక నేలలు మరియు బరువైన నల్ల రేగడి నేలలు బాగా అనుకూలమైనవి.

**పొలాన్ని సిద్ధం చేసే విధానం:** భూమిని రెండు, మూడు సార్లు దుక్కి దున్ని చివరకు చదును చేయాలి. వేసవిలో సాగుకు భూమిని సిద్ధం చేయడానికి ముందు ఒక నీటి తడి ఇవ్వాలి. వాలుకు అడ్డంగా దున్ని విత్తనం విత్తు కోవటం చాలా మంచిది

**విత్తనశుద్ధి:** ఆరోగ్యకరమైన, అధిక మొలక శాతం వున్న వ్యాధి రహిత విత్తనం చాల ముఖ్యం. ఒక కిలో విత్తనానికి 2 గ్రా కార్బండిజమ్ లేదా 3 గ్రా మాంకోజెబ్ లేదా 10 గ్రా ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి.

**విత్తుసమయం : ఖరీఫ్:** జూన్–జూలై, **రబీ:** సెప్టెంబర్–అక్టోబర్, **వేసవి:** జనవరి–ఫిబ్రవరి మాసాలు

**విత్తనమోతాదు:** 3.2–4.8 కిలోల విత్తనం ఒక ఎకరాకు

**విత్తే పద్ధతి:** వరుస లకు మధ్య 25 సెం.మీ. మొక్కల



మధ్య 10 సెం.మీ. దూరంలో ఎక్కువ లోతులో పడకుండా వేసుకోవాలి. 3–4 సెం.మీ కన్నా ఎక్కువ లోతులో పడిన విత్తనం మొలకెత్తకుండా కుళ్ళి చనిపోతుంది. వరుసలలో విత్తుకోవటం వలన మొక్క ధృడంగాపెరగటం, విత్తనం ఖర్చు తగ్గటం, అంతర కృషి సులభం కావటం జరుగుతుంది.

**ఎరువుల యాజమాన్యం:** వరిగ స్వల్పకాలిక పంట, ఇతర తృణధాన్యాలతో పోలిస్తే తక్కువ మొత్తంలో పోషకాలు అవసరం. ఎకరాకు ఆఖరిదుక్కిలో 2 టన్నుల పశువుల ఎరువు వేయాలి. 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ విత్తేటప్పుడు దుక్కిలో వేసుకొని దున్ను కోవాలి. మరో 8 కిలోల నత్రజనిని పైపాటుగా 20 రోజుల తరవాత తేమ వున్నప్పుడు వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం:** ఖరీఫ్ సీజన్‌లో విత్తిన వరిగకు సాధారణంగా నీటి తడులు అవసరం లేదు. ఏది ఏమైనప్పటికీ, పైరు వేసే దశలో, ఎక్కువ కాలం పొడిగా లేకుండా, దిగుబడిని పెంచడానికి ఒక నీటితడి తప్పనిసరిగా ఇవ్వాలి. అయితే వేసవి పంటకు నేల రకం వాతావరణ పరిస్థితులను బట్టి విత్తిన 25–30 రోజుల తర్వాత మొదటి నీటి తడిని, రెండవ నీటి తడిని 40–45 రోజుల తర్వాత ఇవ్వటం మంచిది.

**కలుపు నివారణ:** అధిక దిగుబడి పొందడానికి మరియు నేల తేమ పోషకాల నష్టాన్ని తగ్గించడానికి, పొలాన్ని 35 రోజుల వరకు కలుపు లేకుండా ఉంచాలి. విత్తిన 15 రోజులకి ఒకసారి, 15–20 రోజుల వ్యవధిలో రెండవసారి కలుపు తీయడం వలన పంటలో కలుపు నుంచి ఉపశమనం పొందవచ్చు.

**పంటకోత:** వరిగ పంట 70–90 రోజులలో కోతకు వస్తుంది. గింజలు పసుపు రంగుకు మారి ఆకులన్నీ ఎండినట్లు కనిపించినప్పుడు పంటను కోసుకోవాలి.






**కె. అరుణ్ కుమార్, డా. ఆర్. నరసింహులు,**
**డా. వై.యస్. సతీష్ కుమార్, యం. జ్యోత్స్న కిరణ్మయి,**
**డా. యస్. ఆయేషా పర్వీన్,**
**డా. యన్.సి. వెంకటేశ్వరులు,**
**ఆర్.ఎ.ఆర్.ఎస్, నంద్యాల.**



# చిరుధాన్యాలతో రుచికర వంటకాలు



**సామల పాయసం: తయారీ విధానం:** ఒక కళాయిలో కొంచెం నెయ్యి పోసి సామలను రెండు నిమిషాలు వేయించాలి. ఒక కప్పు అటుకులకి 3 కప్పుల నీళ్ళు పోసి ఉడకనివ్వాలి. కాగిన నీళ్ళలో వేయించిన సామలను వేసి 15 నిమిషాలు ఉడకనివ్వాలి. దీనికి పాలు పోసి మరో 10 నిమిషాలు ఉడకనిచ్చి చివరగా తురిమిన బెల్లం వేసి కలియబెట్టాలి. యాలకుల పొడి వేయాలి. జీడిపప్పు, నెయ్యితో అలంకరించాలి.

**పోషక విలువలు :** 100 గ్రాముల ఈ పదార్థంలో శక్తి 386.9 కి. కేలరీలు, ప్రోటీన్స్ 5.5 గ్రా, కొవ్వు 7.9 గ్రా, కాల్షియం 70.16 మి. గ్రా, భాస్వరం 162.6 మి.గ్రా, ఇనుము 6.02 మి.గ్రా




**రాగి మురుకులు: తయారీ విధానం:** శనగ పిండి, రాగి పిండి, రెండూ జల్లించి కలపాలి. ఉప్పు, కారం,వాము, నువ్వులు వేసి పిండిలో కలిపి రెండు టేబుల్ స్పూన్ల వేడి నూనె పోసి వేడి నీళ్ళతో ముద్దలా కలపాలి బాణలిలో నూనె పోసి కాగిన తర్వాత చక్రాలు చేసే గిద్దలతో గుండ్రటి చక్రాలు వత్తాలి. రెండు వైపులా ఎర్రగా వేయించి తీసుకోవాలి.

**పోషక విలువలు :** 100 గ్రాముల ఈ పదార్థంలో శక్తి 507.7 కి. కేలరీలు, ప్రోటీన్స్ 5.8 గ్రా, కొవ్వు 31.3 గ్రా, కాల్షియం 115 మి. గ్రా, భాస్వరం 160 మి.గ్రా, ఇనుము 2.03 గ్రా.



**వరిగ ఇడ్లీ: తయారీ విధానం:** వరిగలు, ఇడ్లీ రవ్వ వేరు వేరుగా నానబెట్టాలి. వరిగలు, మినపప్పు రెండిటిని రుబ్బుకోవాలి. ఈ మిశ్రమంలో ఇడ్లీ రవ్వ వేసి ఒక రాత్రి వరకు నాననివ్వాలి. తర్వాతి రోజు ఈ మిశ్రమానికి ఉప్పు కలపాలి. ఇప్పుడు ఇడ్లీ ప్లేట్ కి నూనె రాసి దానిలో పిండిని వేసి ఇడ్లీ పాత్రలో పెట్టి ఉడికించాలి.

**పోషక విలువలు :** 100 గ్రాముల ఈ పదార్థంలో శక్తి 344.6 కేలరీలు, ప్రోటీన్స్ 14.3 గ్రా, కొవ్వు 0.9 గ్రా, కాల్షియం 59 మి గ్రా, భాస్వరం 244 మిగ్రా, ఇనుము 1.8 మి.గ్రా



**కమ్యూనిటీ సైన్స్ విభాగం, లామ్, గుంటూరు**

# సులువుగా మల్బరీ పెంపకం



**పట్టు విత్తన క్షేత్రం :** పట్టు పురుగుల పెంపకానికి మూలాధారమైనవి మల్బరీ మొక్కలు. వీటిని మనం కూడా చౌకలో కొని తెచ్చుకోవచ్చు తెలుసా...ప్రభుత్వమే ఈ మల్బరీ మొక్కల కోసం ఒక నర్సరీ ఏర్పాటు చేసింది. గత పదిహేనేళ్ళ నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో రైతులకు కావాల్సిన మొక్కలను పెంచి సరఫరా చేస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో ఈ మల్బరీ నర్సరీ ఉంది. బహు వార్షిక పంట అయిన మల్బరీ సుమారు పన్నెండేళ్ళ వరకు సాగు చేసుకోవచ్చు. మన రాష్ట్రంలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. దాదాపు 75 వేలమంది రైతులు ఈ పట్టు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి పట్టు పురుగుల పెంపకానికి ఆరోగ్యకరమయిన మల్బరీ మొక్కలను ఈ నర్సరీలో అందజేస్తున్నారు. వీటిలో అధిక దిగుబడిని ఇచ్చే వీ1, ఎస్30, ఎస్ 34, ఎస్ 36 రకాలను ఇక్కడ పెంచుతున్నారు. వీటిలో వీ1 రకం ఏడాదికి 20 టన్నుల దిగుబడినిస్తుంది. కాబట్టి రైతులు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. కానీ వీ2 రకం ఏడాదికి 12 టన్నుల దిగుబడిని మాత్రమే ఇచ్చినప్పటికీ చాకీ దశ పురుగుల పెంపకానికి అనువయినది.

ఒక్కో మొక్క రూ.2 వంతున ఇస్తారు. ఒక ఎకరానికి నాలుగు వేల వరకు మొక్కలు అవసరమవుతాయని నర్సరీ అధికారులు ఎస్. అప్పారావు, పాపారావు తెలిపారు. మొక్కను ఆరు నెలల పాటు పెంచి రైతులకు ఇస్తారు. దీనివల్ల రైతు నాటిన మూడు నెలల్లోనే కాపునకు వస్తుంది. దీంతో రైతు ఒక ఏడాదిలో మూడు పంటలకు బదులుగా నాలుగు పంటలు తీసుకునే వెసులుబాటు ఉంటుందని నర్సరీ అధికారులు చెబుతున్నారు. పైగా ఇక్కడ నుంచి తీసుకెళ్ళి పెంచిన మొక్కలు 100 శాతం బతుకుతాయని భరోసా ఇస్తున్నారు.

అంతే కాకుండా ఆసక్తి గల రైతులు మల్బరీ నర్సరీ కూడా పెంచుకోవచ్చని సూచిస్తున్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు తాము అందిస్తామంటున్నారు. ఒక ఎకరంలో నర్సరీ ఏర్పాటుకు లక్షన్నర కడ్డీల అవసరం ఉంటుందని చెప్పారు. వాటిని కూడా సరఫరా చేస్తామంటున్నారు. తాము ఇచ్చిన కడ్డీల్లో 80 నుంచి 90 శాతం మొక్కలు వస్తాయని తెలిపారు. రైతులకు వర్తించే సబ్సిడీలు, పథకాలు కూడా ఉన్నాయని వాటిని స్థానికంగా ఉండే పట్టు పరిశ్రమ సహాయకులను అడిగి తెలుసుకోవచ్చని అధికారులు చెప్పారు.

**వీడియో కొరకు ఆర్.బి.కె. ఛానల్ యూట్యూబ్ లింక్**
https://youtu.be/hGsXPQFXLt8

# వేసవిలో ఆకుకూరల సాగు



ఏడాది పొడవునా ఆకుకూరలకు బాగా డిమాండ్ ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. అదే విధంగా ఆకుకూరల సాగుకు మెట్ట ప్రాంతాలు బాగా అనుకూలిస్తాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రత, తక్కువ నీటి లభ్యత వల్ల కూరగాయల సాగు చెయ్యడానికి తేమ నిలుపుకోగల బరువైన నల్ల భూములు అనూకూలంగా ఉంటాయి. నీటివసతి ఉండే ఇసుక భూములు, ఎర్రనేలలను ఎంపిక చేసుకోవాలి. ఆకు కూర మడులకు తుంపర్ల సేద్యంతో నీటిని ఇస్తే నీటి సమర్థ వినియోగంతో పాటు ఆకు కూర మడులను ఎండ తీవ్రత నుండి కాపాడి అధిక దిగుబడిని సాధించవచ్చు.

ముఖ్యంగా వేసవి సాగుకు అనుకూలమైన రకాలను వేసుకోవడం వలన అవి నీటి ఎద్దడిని తట్టుకొని మంచి దిగుబడిని ఇస్తాయి. వేసవిలో సాగుకు తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర అనువైనవి.

**గోంగూర :** ANGRAU -12, లోకల్ , ఎర్ర గోంగూర రకాలను ఎంపిక చేసుకోవచ్చు. నీరు ఇంకే అన్ని నేలలు గోంగూర సాగుకు అనుకూలం. ఎకరాకు 15-20 కేజీ విత్తనాలు అవసరం. ఒక ఎకరం సాగుకు రూ. 12,000/- ఖర్చు అవుతుంది. విత్తిన తరువాత రెండు నెలలకు పంట చేతికి వస్తుంది. ఆరు నెలలకు దిగుబడి మెరుగ్గా ఉంటుంది. ఎకరాకు 30 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది.

**తోటకూర :** అర్కా సుగుణ, పూసా కీర్తి, అర్కా అరుణ ఎరుపు రకాలు అనుకూలమైనవి. వివిధ ఉష్ణోగ్రతలో పెంచుటకు తోటకూర చాల అనువైనది. ఉష్ణోగ్రత 15°C కంటే తక్కువుగా ఉంటే పంట సమగ్రంగా పెరగదు. నీరు నిలిచే బంక మట్టి మరియు ఇసుక నేలలు దీనికి పనికిరావు. జూన్-అక్టోబర్, జనవరి-మే నెలల మధ్య కాలంలో విత్తాలి. ఎకరాకు 800 గ్రా. విత్తనాలు అవసరం. విత్తేటప్పుడు 10 రెట్లు ఇసుకను కలిపి చల్లాలి. విత్తిన 25 రోజులకు కోత మొదలవుతుంది. మొదటి కోత తరువాత ప్రతి 10 రోజులకు కోత కోయవచ్చు. ఎకరానికి ఖర్చు రూ.10,000 - 15,000/- అవుతుంది. ఎకరానికి దిగుబడి 40-50 క్వింటాళ్ళు వరకు వస్తుంది.





**మెంతికూర :** పూసా ఎర్లీ బంచింగ్, లాం సెలక్షన్-1 రకాలు అనుకూలం. సుగంధ ద్రవ్య ఆకుకూరలలో మెంతి కూర ఒకటి దీన్ని చల్లటి వాతావరణంలో, తక్కువ ఉష్ణోగ్రతలో సాగు చేయవచ్చు. దీనికి ఇసుక నేలలు, నీరు ఇంకే ఒండ్రునేలలు మేలు. ఎకరానికి 6-10 కేజీల విత్తనాలు పడతాయి. ఖర్చు ఎకరానికి రూ. 10,000-15,000 అవుతుంది. విత్తిన తరువాత 25-30 రోజులలో మొదటి కోత చేసుకోవచ్చు. పక్షం రోజుల కొకసారి 3 సార్లు కోత కోయవచ్చు. దిగుబడి 40 క్వింటాళ్ళకు పైన వస్తుంది.

**కొత్తిమీర :** సాధన, స్వాతి రకాలు ముఖ్యమైనవి. కొత్తిమీర సుగంధ ద్రవ్య పంట, అధిక ఆమ్ల, క్షారగుణాలు లేని నేలలు, నీరు ఇంకే భూములు సాగుకు అనూకూలం. ఈ పంట చల్లని వాతావరణంలో మెరుగ్గా పండుతుంది. ఏడాది పొడవునా ఈ పంటను సాగుచేయవచ్చు. విత్తనాన్ని విత్తేముందు 5-6 గంటల సేపు నానబెట్టాలి. ఎకరాకు 8-10 కేజీలు అవసరం. విత్తిన నెలకే కోతకు వస్తుంది. ఎకరాకు 15-20 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ. 12,000/- నుంచి రూ. 15,000/- వరకు వ్యయం అవుతుంది.

**పాలకూర :** ఆల్ గ్రీన్, పూసాజ్యోతి పాలక్ రకాలు అనుకూలమైనవి, సమశీతోష్ణస్థితి పరిస్థితులు పాలకూర సాగుకు అనుకూలం. 35°C దాటితే ఆకులు ఎరుపుగా మారే అవకాశం ఉంటుంది. నీరు ఇంకే నేలలు, చౌడు నేలలు సాగుకు మేలు. పంటకాలం 3 నెలలు ఎకరాకు 10-12 కేజీల విత్తనాలు పడతాయి. పెట్టుబడి రూ. 10,000 - 15,000 ఉంటుంది. విత్తిన తరువత 4-5 వారాలలో పంట కోతకు వస్తుంది.

**సస్యరక్షణ :** పేనుబంక, ఆకుతినే గొంగళి పురుగులు ఆశించే అవకాశం ఉంది. దీనికి తగిన జాగ్రత్తలు తీసుకొని పండించటం వలన ఆశించిన లాభాలు అందుతాయి. సమయానుకూలంగా మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టు పంట సాగు చేస్తూ అధిక లాభాలను పొందేలా రైతులు ఆకుకూరలు సాగు చేసుకోవాలి.



**డా. కె. లక్ష్మీకళ, డా. పి. వెంకటసుబ్బయ్య, డా. ఎన్. రాజశేఖర్, డా. పి.ఎన్. శివప్రసాద్, డా. టి. జస్వంత్ రెడ్డి, డా. ఐ. వెంకట రెడ్డి, డా. ఆర్. ప్రభావతి డా. కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు, ఎన్.టి.ఆర్. జిల్లా**



# ఆరోగ్యానికి అండగా దొండ

బహువార్షిక తీగజాతి కూరగాయల్లో దొండ ఒకటి. దీనిని ఉష్ణ మండల దేశాల్లో సాగు చేస్తున్నారు. దీన్ని నాటిన తరువాత ఇంచు మించు 4-5 సంవత్సరాల వరకు పంట నిస్తుంది. దొండలో విటమిన్ 'సి' మరియు 'ఎ' ఉండటంతో పాటు, దొండ ఆకులను కూడా వైద్య రంగంలో ఉపయోగిస్తారు.లేత దొండ కాయలతో అనేక రకాల రుచికరమైన పదార్థాలను తయారు చేసుకోవచ్చు. ఇది ఎక్కువగా చలికి తట్టుకోలేదు. వేసవి, వర్షాకాలాలలో ఎక్కువగా 2 రకాలు సాగుకు అనుకూలం.

**అర్క నిలచల్ సబుజ :** కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి, క్రీమ్ రంగులో ఉన్న చారలతో కోనికల్ ఆకారంలో వుంటాయి. దూర ప్రయాణాలకు అనువుగా వుండే రకము. ఈ రకం ఎక్కువగా వేడి మరియు గాలిలో తేమ, ఎక్కువగా ఉన్న తూర్పు, దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు అనుకూలమైన రకము. దిగుబడి సరాసరి ఒక మొక్కకు 30-35 కిలోల కాయలను ఇస్తుంది.

**అర్క నిలచల్ కుంకి :** ఇది త్వరగా కాపుకు వచ్చే రకము ఇవి మొక్క నాటిన 40 రోజుల నుండి కాయలను ఇస్తుంది. ఇవి లేత ఆకుపచ్చ రంగులో పొడవుగా, సన్నగా 7.5-8.5 సెం.మీ. ఉండి మెత్తగా ఉండటమే కాకుండా చర్మంపై ఆకర్షణీయమైన చారలు కలిగివుంటాయి. ఒక మొక్క నుండి సుమారుగా ఒక సీజనుకు 20 కిలోల కాయలను ఇస్తుంది.

**ప్రవర్ధనం :** దొండలో ప్రవర్ధనం కాండపు మొక్కల ద్వారా చేస్తారు. ఈ కాండపు మొక్కలను ఒకేసారి ప్రధాన పొలంలో నిర్దేశించిన దూరంలో నాటుకోవచ్చు లేదా పాలిథిన్ సంచిలో పెంచి 25 రోజుల తరువాత ప్రధాన పొలంలో నాటుకోవచ్చును. ఈ విధముగా పెంచడం ద్వారా 70% వరకు విజయం సాధించవచ్చును.

**ఎరువుల యాజమాన్యం** - దొండ ఏడాది పొడవునా పెరగడం వల్ల సమయానుకూలంగా ఎరువులను మొక్కలకు అందించాలి. ఎకరాకు 8-10 టన్నుల పశువుల ఎరువు, 32-40 కిలోల భాస్వరం, 16-20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులతో గుంతలను నింపాలి. ఎకరాకు 32-40 కిలోల నత్రజనిని మూడు సమ భాగాలుగా చేసి నాటిన 15, 30, 45 రోజులకు వేసి నీరు పెట్టాలి. ఎరువులు వేసిన ప్రతిసారీ మొక్క చుట్టూ మట్టిని ఎగదోయాలి. ఇలాచేయడం ద్వారా మొక్క మొదళ్లలో నీరు నిల్వ వుంటుంది. దీనివల్ల మొక్క బాగా పెరుగుతుంది.

**అంతరకృషి, కత్తిరింపులు :** కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేసి నేలను గుల్లబారేటట్లు చేసి మట్టిని ఎగదోయాలి. భూమట్టం నుండి 4 అడుగుల ఎత్తుగా పందిరి ఏర్పాటు చేసుకోవాలి. దొండ తీగ 3-4 నెలల్లో పందిరంతా అల్లుకొని కాపునిస్తుంది కాయకోత తరువాత బలహీనంగా ఉండే తీగలను ఆకులను, పసుపు రంగుకు మారే తీగలను కత్తిరించాలి. పెన్సిల్ మందం ఉన్న తీగలన్నింటిని రెండు



కణువులతో ఉంచి మిగతాదంతా వెనక్కి కత్తిరించాలి. పాదు చుట్టూ ఉన్న మట్టిని తవ్వి కనీసం ఒక వారం వరకు ఎండబారిన పడేటట్లు చేయాలి. తరువాత సిఫార్సు చేసిన ఎరువులను వేసి పాదుల చుట్టూ మట్టిని ఎగదోసి నీటిని పారించాలి.

**అంతర పంటలు :** వరుస మధ్య ఉన్న స్థలంలో బొబ్బర్లు, తోటకూర లాంటి వాటిని పెంచి ఆదాయాన్ని పొందవచ్చును

**కోత /దిగుబడి :** కాయలు లేతగా ఉన్నప్పుడే వారం రోజుల వ్యవధిలో కోయాలి. కాయకోత ఆలస్యం అయితే పండుబారి, విత్తనం ఏర్పడి మార్కెట్‌కు పనికిరావు. సుమారు సంవత్సరానికి ఒక ఎకరాకు 4- 6 టన్నుల దిగుబడినిస్తుంది.


**సస్యరక్షణ : 1. పెంకు పురుగు :** నివారణకు ప్రొఫినొఫాస్ 2 మి.లీ. లేదా మలాథియాన్ 2 మి.లీ., లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**2. పాము పొడ పురుగు :** నివారణకు మొక్క పెరుగుదల దశ నుండి పూత వచ్చేవరకు 5 శాతం వేపగింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. మలాథియాన్ లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ, లీటరు నీటికి కలిపి పురుగు సోకిన ప్రారంభ దశలోనే పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

**3. రసం పీల్చే పురుగులు :** నివారణకు 5 మి.లీ. వేపనూనెను ఒక లీటరు నీటిలో కలిపి ప్రారంభదశలో పిచికారీ చేయాలి. ఎకరాకు 20 చొప్పున పసుపు, నీలి రంగు జిగురు అట్టలను అమర్చాలి. చివరిగా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ., లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**4. ఆకుమచ్చ తెగులు :** నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా లేదా కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

## ఈ సంగతి తెలుసా..!





డా. కె. వెంకట సుబ్బయ్య, జి. శాలిరాజు, డా. సిహెచ్.ఎస్. కిషోర్‌కుమార్, డా. ఎ. దేవీ వరప్రసాద్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, విజయనిర్మల, డా. వి. దీప్తి, ఎ. కరుణశ్రీ, డా. బి. శ్రీనివాసులు, కె.వి.కె., వెంకటరామన్నగూడెం

# నత్తే కదా! అనుకుంటే పంట గుల్లే



ఉద్యాన పంటలను వివిధ రకాలైన పురుగులు, తెగుళ్ళు ఆశించి నష్ట పరుస్తూ ఉంటాయి. సాధారణ చీడ, పీడలే కాక ఈ మధ్య కాలంలో నత్తగుల్లల ఉధృతి కూడా పెరిగింది. ఈ నత్తలు సాధారణంగా బొప్పాయి, తమలపాకు, అరటి, కొబ్బరి, టమాట, బెండ, ఖర్బుజా, పుచ్చ వంటి తోటలను ఆశిస్తుంటాయి. ఇవి ఉద్యాన పంటలనే కాక వరి, సజ్జ, కంది వంటి పంటలను కూడా ఆశించి నష్టపరుస్తుంటాయి.

ఈ నత్త గుల్లలలో రెండు ముఖ్య ప్రజాతులు ఉన్నాయి. ఒకటి జెయింట్ ఆఫ్రికన్ స్నెయిల్, 'రెండు గోల్డెన్ ఆపిల్ స్నెయిల్. మొదటిది మన దేశంలోనికి పరదేశాల నుండి దిగుమతి అయినటువంటి నత్త ప్రజాతి. ఇవి చాలా పెద్ద పరిమాణంలో 50 రకాల పంటలను ఆశించి నష్టపరుస్తాయి. రెండవ రకమైన గోల్డెన్ ఆపిల్ నత్తలు 20-35 మి.మీ. పరిమాణంలో ఉండి ఎక్కువగా వరి, తమలపాకు తోటలను నష్టపరుస్తుంటాయి.

సాధారణంగా పిల్ల మరియు పెద్ద నత్తలు కూడా రాత్రివేళ లేత మొక్కల కాండం, ఆకులు, పండ్లు, పూలను కొరికి తినడం ద్వారా నష్టం కలిగిస్తుంటాయి. ముఖ్యంగా వివిధ రకాల పంటలలో నర్సరీ దశల్లో విపరీతమైన నష్టం కలిగిస్తుంటాయి. ఆకు కూరలను ఆశించి కొరికి తిని వాటి విసర్జితాల ద్వారా కలుషితం చేయడం వలన మార్కెట్‌కు పనికి రాకుండా చేస్తాయి. అలాగే బొప్పాయి, అరటి, కొబ్బరి, తమలపాకు తోటలను ఎగబాకి వాటి ఆకులకు అతుక్కుని ఉండి వ్యవసాయ పనులకు అవరోధం కలిగిస్తాయి. అలాగే వాటిని తిని వాటిపై రంధ్రాలు ఏర్పరుస్తాయి. నత్తలు ఎక్కువగా తేమ కలిగిన ప్రదేశాలను ఇష్టపడతాయి మరియు వర్షాకాలంలో వీటి ఉధృతి అధికంగా ఉంటుంది. నత్తగుల్లలు వర్షం ఉధృతికి పారే కాలువల ద్వారా, నీటి కాలువల ద్వారా ఒక చోట నుండి మరొక చోటుకు వ్యాపిస్తుంటాయి.

**నియంత్రణ :** మొదటగా పొలంలో ఎక్కువ నీరు నిల్వ ఉండి తేమ పరిస్థితులు లేకుండా చూసుకోవాలి. వీటి ఉధృతి అధికంగా ఉన్న ప్రాంతాలలో పొలానికి నీరు సాయంత్రం వేళలో కాక ఉదయపు పూట పారించుకోవాలి. నత్త గుల్లలకు సాధారణంగా పొలంలో ఎక్కువగా సంచరించు తేమ ప్రదేశాలను గుర్తించి వాటిని ఏరి నాశనం చేయాలి. బొప్పాయి కాండం ముక్కలుగా కత్తిరించి తేమ, నీడ ప్రదేశాల్లో ఉంచి, నత్త గుల్లలను ఎరలుగా వాడుకోవాలి. తడి గోనె సంచులను/ పట్టలను లేదా బొప్పాయి ఆకులను కూడా ఎరగా వాడి, వాటికి ఆకర్షింపబడిన నత్తలను ఏరి నాశనం చెయ్యాలి. బంతి మొక్కలను ఆకుకూర పంటలకు చుట్టూ ఎర పంటగా వేసుకోవాలి. నత్తలు ఎక్కువగా సంచరించు ప్రదేశాల్లో సున్నం లేదా బ్లీచింగ్ పౌడరును చల్లుకోవాలి. స్ఫటిక రూపంలో ఉండే సాధారణ ఉప్పును కూడా తోట పంటల లో మొక్క చుట్టూ మొదలులో చల్లుకుంటే నత్తలు





మొక్కల పై భాగానికి చేరి నష్టపరచకుండా ఉంటాయి. కాఫీ గింజల పొట్టు పొడి, వేరుశనగ కాయల పొట్టును చెట్ల మొదలు భాగంలో వేసి నత్త గుల్లలను నివారించుకోవచ్చు. పొలంలో కలుపు మొక్కలు, పంట అవశేషాలు లేకుండా చూసుకోవాలి. ఎక్కువగా అరటి తోటల్లో రైతులు పంట అవశేషాలు వదిలి వేస్తుంటారు. ఇలాంటి పరిస్థితులు నత్తల ఉధృతిని పెంచుతాయి. కనుక రైతులు జాగ్రత్త వహించాలి. నత్తగుల్లల ఉధృతి ఎక్కువగా ఉన్న తోటలలో పగటి పూట కోళ్ళు, బాతులను వదలడం వలన అవి వాటిని ఏరి తిని నాశనం చేస్తాయి. మైలతుత్తం లేదా సూపర్ ఫాస్ఫేట్ పొడిని చెట్ల మొదలు చుట్టూ చల్లితే నత్తలు చెట్లను ఆశించకుండా నివారించవచ్చు. చెట్ల మొదలుకు పలుచటి రాగి రేకులను చుట్టడం ద్వారా కూడా కొబ్బరి వంటి వాణిజ్య పంటలను నత్తల బారినుండి కాపాడవచ్చు. వాడేసిన పూల మొక్కల కుండీలను తిరగేసి తోటల్లో అక్కడక్కడా, ఉంచడం వలన నారింజ, బత్తాయి తొక్కలను లేదా పలచటి చెక్క పలకలను తడిపి నేలపై అక్కడక్కడ ఉంచటం మూలాన ఈ నత్తలు వాటికి



ఆకర్షితమై వాటి క్రింద గుంపులుగా చేరతాయి. వాటిని ఉదయంపూట గమనించి ఏరి నాశనం చేయాలి. చిన్న ప్లాస్టిక్ తొట్టెలలో సారాయి లేదా బీరు లేదా ఈస్టు ద్రావణం పోసి పొలంలో నేల ఉపరితలం వరకు వచ్చేట్టు పాతి ఉంచినట్లయితే రాత్రిళ్ళు నత్తలు వీటి వాసనకు ఆకర్షింపబడి దానిలో పడి మునిగి చనిపోతాయి. ఒక శాతం కాపర్ సల్ఫేట్ ద్రావణం లేదా 3 శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ (బ్లైటాక్స్ ద్రావణం) లేదా 1 శాతం బోర్డో మిశ్రమాన్ని ఆకుకూరలు, తమల పాకులు, లేత బొప్పాయి వంటి తోటల్లో పిచికారీ



చేయడం వలన నత్తలు వాటికి వికర్షింపబడి ఆశించకుండా ఉంటాయి. 3 శాతం పొగాకు కషాయం 0.6 శాతం మైలతుత్తం ద్రావణ మిశ్రమాన్ని మొక్కల పై చల్లినట్లైతే అటువంటి మొక్కలను నత్తలు ఆశించవు. ఆశించినా తిని చనిపోతాయి. మార్కెట్‌లో దొరికే మెటాల్డిహైడ్ అను రసాయనం 5% పొడి మందును వరి పొట్టు కలిపి పొలంలో చల్లడం లేదా 5 శాతం మెటాల్డీహైడ్ గుళికలను చల్లితే నత్తల ఉధృతి తగ్గించవచ్చు.

**గమనిక:** మెటాల్డిహైడ్‌ను పొలంలో చల్లినప్పుడు, పెంపుడు కోళ్ళు, కుక్కలు, పిల్లులు వంటి జంతువులు వాటిని తినకుండా జాగ్రత్త వహించాలి.

**డా. జి. శారద, డా.వి. నిశ్చల, జి. రాజేశ్వరి, డా. యం. రామయ్య, డా. కె. గోపాల్ ఉద్యాన కళాశాల, అనంతరాజుపేట, డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం.**



# మిరపలో
## కోత ముందు, తరువాత జాగ్రత్తలు

మిరప కోత సమయం 150-180 రోజుల్లో చేతికి వస్తుంది. నారు నాటిన 50-60 రోజుల తరువాత పూతకు వస్తుంది. మిరప లో రకాల ఎంపిక చాల అవసరం. ఎకరాకు సూటి రకాలైతే 25 క్వింటాళ్ళు. సంకర రకాలైతే 35-45 క్వింటాళ్ళ ఎండు మిర్చి దిగుబడి రావడానికి అవకాశం ఉంటుంది. మిరపకాయల రంగు, ఘాటు నాణ్యతను నిర్దేసిస్తాయి. నాణ్యత, ప్రమాణాలలో తేమ ప్రముఖ పాత్ర వహిస్తుంది. కాయలు కోసినపుడు 75-80% తేమ ఉంటుంది, దీనిని 10-11% వచ్చే వరకు ఆరబెట్టుకోవాలి. కాయలు పొడవుగా వుండి గింజల శాతం, వాటి బరువు, మంచి రంగు ఘాటు కలిగిన కాయలు నాణ్యమైనవి.

**కోతకు ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు:** కోతకు ముందే పంటకు నీటి తడులివ్వాలి. కాయ కోతకు కనీసం 15 రోజుల ముందు నుండి ఎటువంటి సస్యరక్షణ మందులు పిచికారీ చేయకూడదు, చేసినట్లైతే మిరపకాయల మీద అవశేషాలు వుండే అవకాశం ఉంటుంది.

**కోత సమయుంలోను, అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు:** మొక్కల మీద పూర్తిగా పక్వానికి వచ్చి, రంగు వచ్చిన కాయలను పొడి వాతావరణం ఉన్న సమయాల్లో మాత్రమే కోయాలి. కాయల్ని మొక్కల మీద మరీ ఎక్కువగా పండనిస్తే కాయలు ముడతలుపడడమే కాకుండా సూర్యరశ్మి అధికంగా సోకి రంగు తగ్గి నాణ్యత కోల్పోతాయి. అందువల్ల కాయల్ని రంగు తిరిగిన వెంటనే కోయాలి. ఇలా కోసినట్లైతే ఎండిన తరువాత తొడిమ ముడతపడక కాయలకు మంచి నిగారింపు వస్తుంది. వీలైనంతవరకు కాయ కుళ్ళు తెగులు, కాయ తొలుచు పురుగు ఆశించిన కాయల్ని వేరుచేసుకోవాలి.

కాయ నాణ్యత దిగుబడులు పెరగాలంటే సరైన సమయంలో కోయడంతోపాటు, ఎప్పటికప్పుడు పండిన కాయల్ని తరుచు వీలైనన్ని ఎక్కువ సార్లు అంటే 7 - 8 కోతలు కోయాలి. కాయలు కోసిన తరువాత ఒక రోజు రాశిగా పోసి పట్టలతో కప్పినట్లయితే కాయలన్నీ సరిసమానంగా పండుతాయి. కాయలను నేరుగా నేలపై గాని, ఇసుక/ పేడతో అలికిన కళ్ళాల్లో ఆరపెట్టకూడదు. ఇలా ఆరపెడితే ఆస్పర్జిల్లస్ అనే శిలీంద్రం వల్ల ఆఫ్లోటాక్సిన్ అనే విష పదార్థం సోకే అవకాశం వుంది. దీనివల్ల కాయ నాణ్యత దెబ్బతింటుంది. కోసిన కాయల్ని పట్టాల మీద కానీ లేదా శుభ్రమైన కాంక్రీట్ కళ్ళాల మీద మాత్రమే ఆరబెట్టుకోవాలి. కాయలను పలుచగా పోసి కనీసం 15 -20 రోజుల పాటు తిరగతిప్పుతూ ఎండబెట్టుకోవాలి. కాయలు సరిసమానంగా ఎండకపోతే రంగును, మెరుపును కోల్పోతాయి. కాయల్ని మంచు బారిన పడకుండా పరదాలు కప్పి ఉంచుకోవాలి. కాయల్ని ఎండబెట్టేటప్పుడు దుమ్ము, ధూళి, చెత్త-చెదారం చేరకుండా శుభ్రంగా వుంచుకోవాలి. 10% మించి ఎక్కువగా తేమ ఉండకుండా ఎండబెట్టాలి.

తెగుళ్ళు ఆశించిన తాలు కాయల్ని ఏరి వేరు చేసుకోవాలి. అకాల వర్షాలకు గురికాకుండా, మంచు బారిన పడకుండా, రంగు కోల్పోకుండా ఆధునిక డ్రయర్లలో ఎండబెట్టి నాణ్యమైన మిరప కాయల్ని పొందవచ్చు. ఇలా ఎండబెట్టిన మిరప కాయల్ని నిల్వచేయడానికి తేమ లేనటువంటి పొడి గోనె సంచుల్ని వాడుకోవాలి. ఎండిన కాయల్ని గోనె సంచులలో నింపేటప్పుడు కాయలపై నీరు చల్లకూడదు. నిల్వచేసిన బస్తాలకు తేమ తగలకుండా అడుగున చాపలు లేదా వరిపొట్టు లేదా కర్ర చెక్కలు పరచుకోవాలి. శీతలీకరణ గిడ్డంగులలో నిల్వచేస్తే కాయలు 8-9 నెలల వరకు రంగు నాణ్యత కోల్పోకుండా వుంటాయి. కాయలు రంగు రావడానికి నిషేధిత కృత్రిమ రంగులు వాడకూడదు. నిల్వ చేసిన మిరప కాయల్ని అప్పుడప్పుడు ఎండబెడుతూ వుండాలి. ఇలా అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తే మిరపలో నాణ్యమైన దిగుబడి రైతులు పొందవచ్చును.



**డా. జె. ఫణి కుమార్, డా.సి. వెంకటరమణ, డా. ఎ. రాధికా రమ్య, డా. ఆర్. నాగలక్ష్మి, డా.టి. విజయలక్ష్మి, డా.కె. శిరీష, డా.వై. కావ్య. డా.బి. తనూజప్రియ, డా. కె. గిరిధర్, ఉద్యాన పరిశోధన స్థానం, డా.వై. యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, గుంటూరు.**




**ఆదర్శం – అభిమానం :** ఫిబ్రవరి 28 న తెనాలిలో జరిగిన రైతు భరోసా సాయం విడుదల సభలో అభ్యుదయ రైతులతో ముఖ్యమంత్రి వర్యులు. చిత్రంలో వ్యవసాయ శాఖ మంత్రి




**ప్రశంస :** తిరువనంతపురంలో జరిగిన వైగా సదస్సులో ఆర్.బి.కె. స్టాల్ వద్ద వ్యవసాయశాఖ మంత్రి



**ప్రారంభం :** అనంతపురంలో రాష్ట్ర స్థాయి పండ్ల ఉత్పత్తిదారుల సంస్థల సమ్మేళనం ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి




**ఆసక్తి :** నంబూరు ఆర్.బి.కె.లో కియోస్క్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



**పరిశీలన :** పల్నాడు జిల్లాలో రాగి పంటను పరిశీలిస్తున్న అగ్రి మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

# పుచ్చ, ఖర్బుజాల్లో తెగుళ్ల నివారణ



వేసవి కాలంలో సాధారణంగా రైతులు పుచ్చ, ఖర్బుజా సాగు చేసి లాభాలు పొందుతున్నారు పుచ్చ, ఖర్బుజా సాగు చేయటానికి ఎక్కువ ఉష్ణోగ్రతతో కూడిన పొడివాతావరణం అనుకూలం. ఈ పంటలలో సోకే కొన్ని ముఖ్యమైన తెగుళ్ళు, వాటిని నివారించే పద్ధతులు ఈ క్రింద తెలుసుకుందాం.

**బూజుతెగులు :** మొక్క అన్ని దశలను ప్రభావితం చేస్తుంది ఈ వ్యాధి ఆకులకు మాత్రమే సోకుతున్నప్పటికీ మొక్కల అభివృద్ధి ప్రారంభంలో కిరణజన్య సంయోగ క్రియ తగ్గడం వల్ల మొక్కలు కుంగిపోతాయి మరియు దిగుబడి తగ్గుతుంది మొదట్లో ఆకులపై లేత ఆకుపచ్చ ముదురాకుపచ్చ కలిపి మొజాయిక్ వలె కనిపిస్తుంది తరువాత ఆకుల పైభాగాన పసుపు రంగు మచ్చలు అడుగు భాగాన ఊదారంగు మచ్చలు బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది ఆకులు పండుబారి ఎండిపోతాయి

**నివారణ** బూజుతెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ 2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి

**బూడిద తెగులు :** ఈ తెగులు సోకినప్పుడు ఆకులపై భాగాన ముందుగా తెలుపు లేదా బూడిద రంగులో చిన్నచిన్న మచ్చలు ఏర్పడి తరువాత తెల్లని పొడి వంటి పదార్థం ఏర్పడుతుంది. ఈ తెగులు లేత ఆకుల కన్నా ముదురు ఆకుల మీద ఎక్కువగా కనిపిస్తుంది. చివరికి ఆకులు పండుబారి ఎండిపోతాయి. ఈ తెగులు పొడి వాతావరణం అధిక ఉష్ణోగ్రత ఉన్నప్పుడు తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

**నివారణ :** బూజు తెగులుకు పూర్తి లేదా పాక్షిక నిరోధక శక్తి కలిగిన రకాలను ఉపయోగించాలి. భూసారపరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వెయ్యాలి. నత్రజనిని అధిక మోతాదులో వాడకూడదు. మొక్కకు మొక్కకు మధ్య సరైన దూరం మరియు కలుపు నివారణ చర్యలు పాటించటం ద్వారా దీనిని కొంత మేరకు నియంత్రించ వచ్చు. దీని నివారణ కోసం ట్రైడిమార్ఫ్ 1 మి.లీ. లేదా మైక్లోబ్యుటనిల్. 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఫ్యూజేరియం వేరు కుళ్ళు తెగులు :** ఇసుక పొడి నేలల్లో దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈతెగులు సోకిన మొక్కలు రెండు నుంచి మూడు రోజుల్లో చనిపోతాయి, లేని యెడల ఆ మొక్కల ఎదుగుదల పూర్తిగా ఆగి పోతుంది. ఈ శిలీంద్రం భూమిలో ఉండి వ్యాపిస్తుంది. దీనినే ఎండు తెగులు అని కూడా పిలుస్తారు.

**నివారణ :** బోర్డో మిశ్రమము లేదా 1% కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా/లీ. నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్క చుట్టు ఉన్న నేల తడిచేలా పది రోజుల్లో రెండు నుంచి మూడు సార్లు పొయ్యాలి. ఆఖరి దుక్కిలో వేప పిండి ఎకరాకు 250 కిలోలు చొప్పున వేసి కలియ దున్నాలి.

**పక్షి కన్ను తెగులు :** ఇది పువ్వులు, లేత ఆకులు, పండ్ల పైన ప్రభావం చూపుతుంది. మచ్చలు చిన్న పరిమాణంలో ఉండి బాగా పెద్ద పరిమాణంలోకి మారతాయి. ఆకులు పండ్లు రాలిపోయి కొమ్మలు

చనిపోతాయి. ఫలితంగా చెట్టు కొనల నుండి చనిపోయిన లక్షణాలు కనపడతాయి. ఆకు లపై నిర్జీవమైన మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు రాలి పడిపోవటం వలన షాట్ హోల్ ఎఫెక్టు కనిపిస్తుంది.



**నివారణ :** అందుబాటులో ఉండే తెగులు నిరోధక రకాలను పెంచాలి. పొలంలోని వ్యర్థాలను తొలగించి కాల్చివేయాలి. కార్బండిజమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



**బడ్ నెక్రోసిస్ వైరస్ :** ఇది సాధారణంగా పుచ్చ కాయలో ఆశిస్తుంది ఇది తామర పురుగుల ద్వారా వ్యాపిస్తుంది నారుమళ్ళు సాలు తోటలలోను ఆశించి మొవ్వ లేదా చిగురు భాగం ఎండిపోతుంది కాండం పై నల్లమచ్చలు ఏర్పడి క్రమేణా చారలుగా మారతాయి ఆకులపై వలయాలుగా నెక్రోటిక్ మచ్చలు ఏర్పడి పండుబారి రాలిపోతాయి.


**నివారణ :** దీని నివారణ కోసం ముందుగా తామర పురుగులు ఆశించకుండా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయో మిథాక్సమ్ 0.3 మి.లీ. లేదా అసిఫేట్ 1.5 గ్రా. పిచికారీ చేయాలి.

**కుకుంబర్ మొజాయిక్ వైరస్ :** ఇది పేనుబంక ద్వారా వ్యాప్తి చెందుతుంది మొక్కలు గిడసబారి ఎదుగుదల లోపించి పొట్టిగా ఉంటాయి ఆకులలో పత్రహరితం కోల్పోయి ఆకారం మారిపోయి కొనలు సాగి మొజాయిక్ లక్షణాలు కనబడతాయి, పూత, కాయ ఉండదు.

**నివారణ :** దీని నివారణ కోసం ముందుగా పేనుబంక ఉధృతి ఎక్కువ అవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెగులు సోకిన మొక్కలని ఏరివేసి కాల్చి వేయాలి.


**డా. కె. లక్ష్మీకళ, డా. పి.వెంకట సుబ్బయ్య, డా.ఎన్. రాజశేఖర్, డా.పి.ఎన్. శివ ప్రసాద్, డా.టి.జస్వంత్ రెడ్డి, డా.ఐ. వెంకట రెడ్డి, డా.ఆర్.ప్రభావతి**
**డా.కే.ఎల్.రావు కృషివిజ్ఞానకేంద్రం, గరికపాడు, ఎన్.టి.ఆర్ జిల్లా**







# నాణ్యమైన దిగుబడికి ముఖ్యమైన చర్యలు



మనం పండించే వివిధ రకాల పండ్లలో మామిడి చాలా ప్రధానమైన పంట ఇటువంటి మామిడి ప్రస్తుతం  పూత చివరి దశ నుండి కాయలు కోసే దశలలో ఉన్నది కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుని నాణ్యమైన దిగుబడిని పొందటానికి తీసుకోవలసిన యాజమాన్య చర్యల గురించి తెలుసుకుందాం. మామిడి తోటలలో పూత, పిందెలు రాలుతున్నట్లయితే చెట్లకు నీరు అందుతున్నది లేనిది గమనించి, అందించాలి.

నీరు అందించిన తోటలలో కూడా చిన్న పిందెలు రాలుతున్నట్లయితే ప్రతి చెట్టుకు 500 గ్రా యూరియా 1 కిలో పోటాష్ ఎరువులను పాదులలో వేసుకోవాలి. కాయలు చిన్న గోళీకాయ సైజులో పండుబారి రాలిపోవటం జరుగుతుంది. దాని నివారణకు సూక్ష్మధాతువులైన జింక్ 2 గ్రా బోరాన్ 2 గ్రా కాల్షియం 2 గ్రా, మెగ్నీషియం 2 గ్రా,, దానితో పాటు పొటాషియం నైట్రేట్ 5 గ్రా, ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి తోటలలో రసం పీల్చే పురుగులు అయిన తేనె మంచు పురుగు, పిండినల్లి తామర పురుగులు కనిపిస్తే ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 0.3 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా



క్లోరిఫైరిఫాస్ 1 మి.లీ కాని పిచికారీ చేసుకోవాలి, క్రమం తప్పకుండా కొమ్మ కత్తిరింపులు చేస్తూ కలుపు లేకుండా చూసుకున్నా రసం పీల్చే పురుగులను అరికట్ట వచ్చును.

తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటే పిప్రోనిల్ 2 మి. లీ. దానితో పాటు వేప నూనె 1500 పి.పి.ఎం. 3 మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలి.

మామిడి కాయ పెరుగుదల దశలలో గోళీకాయ సైజు నుండి పెద్ద నిమ్మకాయ సైజు వరకు ఆశించే పురుగులలో కాయ తొలుచు పురుగు లేదా ముడ్డి పుచ్చు పురుగు ముఖ్యమైనవి. దాని నివారణకు తోటలలో సాయంత్రం వేళలో చిన్న మంటలు వేయటం దీని వలన తల్లి రెక్కల పురుగులు ఆకర్షించబడి  మంటలో పడి చనిపోవటానికి ఆపకాశం అధికంగా ఉంటుంది. ఉధృతి అధికంగా ఉన్న ఎడల ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా దానితో పాటు వేపనూనె 10000 పి.పి.ఎం., 1 మి.లీ. హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేక కార్బండిజమ్ + మాంకోజబ్ 2 గ్రా కలిపి పిచికారీ చేయాలి..

మనం ఏ  ద్రావణం పిచికారీ చేసినా జిగురు లేదా కొంచెం సర్ఫ్ కలిపి పిచికారీ చేసుకోవటం వలన మందు ఆకులకు అంటుకొని ఉంటుంది.

మామిడిలో ఏప్రిల్, మే లో వచ్చే అకాల వర్షాల వలన కాయలపై, మంగు మచ్చలు లేదా  మసి మచ్చలు లేదా తొడిమెల వద్ద కుళ్ళు రావటానికి అవకాశం అధికంగా ఉంటుంది. కాబట్టి అకాల వర్షాలు కురిసే ప్రాంతాలలో





కాపర్ఆక్సీక్లోరైడ్ 3గ్రా లేదా కార్బండిజమ్ 1 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.


కాయ పక్వానికి వచ్చేటప్పుడు ఆశించే మరొక ప్రధాన సమస్య పండుఈగ. ఇవి కాయలలోనికి గ్రుడ్లను చొప్పించటం వలన కాయలు పండిన తరువాత తెల్లని బియ్యపు గింజ లాంటి లార్వాలను మనం గమనించవచ్చును. దీని నివారణకు లింగాకర్షక బుట్టలను ఎకరానికి 4-5 వరకు అక్కడక్కడా పెట్టి పండుఈగ ఉధృతిని గమనించాలి అంతే కాక మట్టి కుండలలో పులిసిన కల్లు, కొద్దిగా బెల్లం (100గ్రా) మలాథియాన్ 2. మి.లీ లీటరు నీటికి కలిపి తోటలో అక్కడక్కడ పెడితే పండుఈగ బెడద అరికట్టవచ్చును. అంతే కాక ఫ్రూట్ కవర్లు కూడా రైతులు వాడి నాణ్యమైన కాయలను ఉత్పత్తి చేయవచ్చును.



పండు ఈగ ఉధృతి అధికంగా ఉన్న తోటలలో మలాథియాన్ 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ 1 మి.లీ. కాని పిచికారీ చేయాలి ముందుగా తోటలలో రాలిన కాయలను ఏరి కాల్చివేయాలి తోటలను శుభ్రంగా వుంచు కోవాలి.

మన రాష్ట్రంలో మామిడిని ఆశిస్తున్న మరొక తెగులు నల్ల మచ్చ తెగులు ఇది ముఖ్యంగా బంగినపల్లి రకాలలో బ్యాక్టీరియా వలన వస్తుంది, కాయలపైన ఆకులపైన డెల్టా ఆకారం మచ్చలు కనిపిస్తాయి. ఆకులు పండుబారి రాలటం, కాయల నుండి సొన కారటం దీని లక్షణం

ఈ తెగులు అరికట్టుటకు కాపర్ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. దానితోపాటు అగ్రిమైసిన్ 0.2 గ్రా స్ట్రెప్టోసైక్లిన్ 0.2 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయ కోతకు 20 రోజుల ముందుగా నీరు కట్టరాదు. కాయలను అభివృద్ధి పరిచిన కాయ కోత పరికరాలను ఉపయోగించి కాడతో సహా కత్తిరించి తోట లోనే మంచెపై కాయలను తలక్రిందులుగా ఉంచి సొన కారిన తరువాత శుభ్రపరిచి పెట్టెలలో అమర్చి కాయలను మార్కెట్‌కు పంపటం వలన అధిక ధరను పొందవచ్చును రైతులు పక్వానికి వచ్చిన పిదప కాయలను జాగ్రత్తగా కోసి తగిన విధంగా మగ్గ బెట్టి రైతు బజార్ల ద్వారా సంఘటితంగా అమ్ముకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు.



**డా బి కనకమహాలక్ష్మి, డా జి స్రవంతి, డా కె రాధారాణి,**
**మామిడి పరిశోధన స్థానం నూజివీడు.**

# అల్లుకుని కాసే ఆగాకర





ఆగాకర బహువార్షిక కూరగాయ మొక్క. దీనిలో వున్న పోషక విలువల రీత్యా వీటిని మధుమేహం, మలబద్ధకం నివారణకు, కంటి చూపు పెంపొందించుటకు, చర్మం, దగ్గు, ఆయాసం వంటి శ్వాస సంబంధించిన వ్యాధులకు, కడుపులో అల్సర్లు, పైల్స్ కు విరుగుడుగా కూడా వాడతారు. కావున అధిక దిగుబడికి క్రింద సూచించిన మెళకువలు పాటించి నట్లయితే మంచి ఫలితాలు రావడానికి ఆస్కారం ఉంటుంది. "ఆగాకర" సాగుకు అధిక వర్షపాతం, మధ్యస్థ వేడి, అధిక తేమ అవసరము. "ఆగాకర"లో "అర్క నిలచల్ శాంతి 'అన్నే ఆగాకర మరియు "టీగుల్ గార్డ్ 'ని సంకరం జరిపి అభివృద్ధి చేయడం జరిగింది. కాయలు 20 గ్రా బరువు వుండి మొక్కకు సుమారుగా 15-16 కిలోల కాయలను ఇస్తుంది. ఈ రకం కాయ తొలుచు పురుగును, బూజు తెగుళ్ళను, ఆంత్రక్నోస్‌ను కొంతవరకు తట్టుకొంటుంది. విత్తనం ద్వారా ప్రవర్ధనం చేయడం సులువైన పద్ధతి కాని ఆడ, మగ మొక్కలు వుంటాయి. అంతేకాకుండా విత్తనం ద్వారా అయితే మొలకశాతం 30 శాతం మాత్రమే వుంటుంది. అంతేకాక వచ్చిన మొక్కలలో మూడు వంతులు మగ మొక్కలు ఒక వంతు ఆడ మొక్కలు వస్తాయి. కావున ఎకరాకు 8-10 కిలోల విత్తనం అవసరమవుతుంది. పొలంలో 6×6 మీ, దూరంలో నాటిన స్తంభాల మధ్య 2×2 మీ చొప్పున 16 మొక్కలు వస్తాయి (అనగా 36 చ. మీ. లకు). ప్రతి 10 ఆడ మొక్కలకు, 1 మగ మొక్కను విధిగా వుంచుకోవాలి. దాదాపు 1000 ఆడ మొక్కలకు 100 మగ మొక్కలు వుండాలి. ఎత్తైన నారుమడిని 4 × 1 మీ. సైజులో తయారుచేయాలి. 15 సెం.మీ. వరుసల మధ్య 10 సెం.మీ. దూరంలో విత్తనాలు విత్తాలి. వీటిపై గడ్డిని కప్పాలి. 40-45 రోజులలో మొలకలు వస్తాయి. మార్చి నెలాఖరులో నారుమడి వేస్తే జూన్ లో నాటుకు తయారవుతాయి. దుంపల ద్వారా అయితే జూన్ నుండి అక్టోబరు మధ్య ఎక్కువగా పూసే ఆడ మొక్కలను, తక్కువ ఎత్తులో పూసే మగ మొక్కలను ఎంచుకొని వీటి దుంపలను సేకరించి మరుసటి సంవత్సరం నాటుకోవచ్చు. 2-3 సంవత్సరములలో వీటికి వచ్చే పిల్ల దుంపలను కూడా విత్తనంగా వాడుకోవచ్చు. శాఖల ద్వారా అయితే ఎంచుకొన్న మంచి మొక్కల తీగలను 5 కణుపులు వుండేలాగ కత్తిరించి, సెరటిక్స్-బి. అనే హార్మోను పొడిలో వేర్లు ముంచి, ఎత్తైన నారుమళ్ళలో నాటి తడిపితే 30 రోజులలో వేర్లు వస్తాయి. వాటి వేర్లు దుంపలుగా మారి మరుసటి సంవత్సరం విత్తనం మొక్కలుగా నాటుకోవచ్చు. దుంపలను గాని, విత్తనం మొక్కలను గాని 30×30 సెం.మీ. కొలతలు కలిగిన పశువుల ఎరువుతో నింపిన గుంతలో నాటుకోవాలి. నేరుగా విత్తనాలు నాటుకోవాలంటే ప్రతీ గుంతకు 10-15 విత్తనాలు వేస్తే, 3-5 మొలకలు 40-45 రోజులలో వస్తాయి . అప్పుడు ఒక ఆడ తీగను వుంచి మిగతావి వేరే చోట నాటుకోవాలి. పోషణ "ఆగాకర" (లేదా) తీగజాతి కూరగాయలలో అదిక దిగుబడులకు పోషకాలను సమగ్రంగా, సకాలంలో అందించాలి. విత్తేముందు ఎకరాకు ఆఖరి దుక్కిలో



8-10 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి నాటిన 15 రోజులకు, 30 రోజులకు 45 రోజులకు 50కిలోల నత్రజనిని 3 సమభాగాలుగా చేసి వేయాలి. రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులను వాడటం వలన నేల గుల్లబారి, నీటిని ఎక్కువకాలం నిల్వచేసుకునే శక్తి పెరుగుతుంది. అవసరాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీటిని మొక్కలకు అందించాలి. మొక్కల పాదుల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. "మల్చింగ్" చేయడం వలన నేల ఉష్ణోగ్రత పెరిగి మొక్క త్వరగా పెరగడమే కాక, నేల నుండి నీరు ఆవిరవ్వడం తగ్గి నీరు ఆదా అవుతుంది "మల్చింగ్" వలన కలుపు సమస్యను తగ్గించడమే కాక ఖర్చును కూడా తగ్గించవచ్చు. ఈ "మల్చింగ్‌ని నీటి సదుపాయం తక్కువుగా వున్న ప్రాంతాల్లో వేసుకోవచ్చు. డ్రిప్ పద్దతి (లేదా) బిందు పద్ధతిని కూరగాయల సాగులో అవలంబించడం వలన భూమిలో తేమ హెచ్చు తగ్గులు లేకుండా మొక్క పెరుగుదలకు అనుగుణంగా నీటిని, ఎరువులను సరఫరా చేయడం వలన మొక్కలు ఏపుగా పెరిగి త్వరితగతిన పక్వానికి వచ్చి నాణ్యమైన దిగుబడులను అధికంగా పొందవచ్చును. ఈ విధానాన్ని అవలంచించడం వలన 90-95 శాతం వరకు నీటి వినియోగ సామర్థ్యం పెరిగి 21-50% వరకు సాగునీటిని ఆదా చేయవచ్చును. పందిరి విధానాన్ని తీగజాతి కూరగాయలైన "ఆగాకర 'లో అవలంబించడం వలన తీగలును పాకించడానికి అనువుగా వుండటమే కాకుండా గాలి, వెలుతురు బాగా సోకి కిరణజన్య సంయోగక్రియ బాగా జరగడం, తెగుళ్ళు, పురుగుల ఉధృతి కూడా తగ్గి నాణ్యమైన దిగుబడులు రావడానికి ఆస్కారం ఎక్కువగా వుంటుంది. ఈ విధముగా పైన చెప్పిన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే ఆగష్టు చివరి వారం నుండి నవంబర్ మొదటి వారం వరకు కాయలు వస్తాయి. వచ్చిన కాయలను వారానికి రెండు సార్లు కోయాలి. నవంబర్ తరువాత తీగలు ఎండి పోవడం జరుగుతుంది. వీటిని నీరు ఇవ్వకుండా అలానే వుంచితే దుంపలు నిద్రావస్థలో వుండిపోయి మరల తొలకరి వర్షాలకు - అంటే జూన్ మాసంలో దుంపల నుండి తీగల పెరుగుదల ప్రారంభమవుతుంది. మరల ఎరువులు వేసి నీటిని ఇస్తే ఇంకో పంట వస్తుంది. ఒకవేళ వర్షాకాలంలో వర్షపాతం తక్కువైనప్పుడు 10 రోజుల కొకసారి తేలికపాటి తడులు ఇవ్వాలి.

**సస్యరక్షణ :** ఆగాకర 'సాగులో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు గమనించినట్లయితే "పండు ఈగ', మొగ్గ కాయ తొలిచే పురుగు, పాముపొడ మరియు పేనుబంక, తామర పురుగులు ప్రధానమైనవి .పండు ఈగ విషపు ఎరలను పొలంలో 10-12 మూకుడులలో పోసి పెట్టాలి. 100 మి.లీ, మలాథియాన్ 100 గ్రా బెల్లంలో 10 లీ. నీరు కలిపి విషపు ఎరలను తయారు చేసుకోవాలి. మొగ్గ, కాయతొలచే పురుగు 0.5 గ్రా. థయోడికార్బ్‌ను ఒక లీటర్ నీటికి కలిపి లేదా, 2 మి.లీ. క్లోరిపైరిపాస్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పేను బంక, తామర పురుగులు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా డైమిథోయేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**డా. కె. వెంకట సుబ్బయ్య, వెంకట సతీష్ కూచి,**
**జి. శాలిరాజు, డా. సిహెచ్.ఎస్. కిషోర్‌కుమార్,**
**డా. ఎ. దేవీ వరప్రసాద్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి,**
**విజయనిర్మల, డా. వి. దీప్తి, ఎ. కరుణశ్రీ,**
**డా. బి. శ్రీనివాసులు, కె.వి.కె. వెంకటరామన్నగూడెం**





# తక్కువ ఖర్చుతో అధిక రాబడినిచ్చే సపోట

పిల్లలకు మంచి ఆహారమైనటువంటి సపోటా పండ్లు అధిక శక్తినీ, కాల్షియం మరియు విటమిన్‌లు శరీరానికి అందజేస్తాయి. ఈ పండుకు చీడపీడల బెడద చాలా తక్కువ కాబట్టి తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చు.

**రకాలు:** సపోటా 50-60 సం,,ల వరకు దిగుబడినిచ్చే దీర్ఘకాలిక పంట కాబట్టి డిమాండును అనుసరించి సరైన రకాన్ని ఎంపిక చేసుకోనుట ఎంతో అవసరం..

**పాల :** మన రాష్ట్రంలో అధికముగా ఇష్టపడే రకం ఎక్కువగా సాగులో ఉంది. పండు పరిమాణం చిన్నగా ఉండి కోలగా ఉండి గుత్తులుగా కాస్తుంది. తోలు పలుచగా ఉండి కండ మృదువుగా అధిక తీపిగా ఉంటుంది. ఈ రకం ఎక్కువ సమయం నిలువ ఉండవు కనుక రవాణాకు అనుకూలం కావు

**క్రికెట్ బాల్ :** ఈ రకం పండు గుండ్రముగా ఉండి పెద్ద పరిమాణం కలిగి ఉంటుంది కండ రవ్వలాగా ఉండి తక్కువ తీపి, ఎక్కువ గింజలు ఉంటాయి. పొడి వాతావరణంలో కూడా ఎక్కువ దిగుబడిని ఇస్తుంది.

**ద్వారపూడి :** కాయ క్రికెట్ బాల్ రకాన్ని పోలిఉండి కండ అధిక రవ్వలుగా ఉంటుంది

**కలిపత్తి :** పండ్లు కోలగా మధ్యస్థ పరిమాణం కలిగి ఉంటాయి కండ తీయగా ఉండి, తోలు మందంగా ఉంటుంది. ఎక్కువ కాలం నిల్వ ఉండే రకం కాబట్టి రవాణాకు అనుకూలం

**పి.కె.యం.1 :** ఈ రకం చెట్టు గుబురుగా పొట్టిగా ఉంటుంది కాబట్టి అధిక సాంద్రతలో నాటడానికి అనుకూలం. పండు కోలగా మధ్యస్థ పరిమాణంలో ఉండి పలుచటి కండతో తీయగా ఉంటుంది. అధిక దిగుబడిని ఇచ్చే రకం.

**పి.కె.యం.2 :** పండు కోలగా ఉండి మధ్యస్థ పరిమాణంలో మంచి రుచికరంగా ఉంటుంది. కోస్తాంధ్ర ప్రాంతానికి అనువైన రకం. చెట్టు నిలువుగా పెరుగుతుంది. కాబట్టి కొబ్బరి తోటలో అంతర పంటగా సాగుకు అనుకూలమైన రకం.

**డి.హెచ్.ఎస్.1 :** పండు కోలగా ఉండి పెద్ద పరిమాణంలో తీయగా ఉంటుంది.

ఇవే కాకుండా సింగపూర్ తరంగపూడి, గుత్తి గవరయ్య వంటి రకాలు కూడా అనుకూలం.

**వ్యాప్తి :** ఏడాది నుంచి రెండు సంవత్సరాల వయసు గల కొమ్మ అంట్లను ఎంపిక చేసుకోవాలి. రెండు సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల అంట్లను ఎంపిక చేసుకుంటే వేరు


వ్యవస్థ గుండ్రంగా చుట్టుకుని పోయి ప్రధాన పొలంలో నాటిన తరువాత మొక్క నిలదొక్కుకోవడానికి సమయం ఎక్కువ తీసుకోవడమే కాక కొన్ని మొక్కలు చనిపోయే అవకాశం ఉంది.

**ఎరువులు :** జూన్, జూలై నెలల్లో మొక్కల వరుసల మధ్య దున్ని పాదులు చేసుకొని, ఎరువులు వేసుకోవాలి. మొక్కకు చుట్టూ 1.5 మీ పాదులు చేసి ఎరువులను వేసి తేలికపాటి తడిని అందించాలి.

**అంతర పంటలు, అంతరకృషి :** లేత తోటలు కాపునకు వచ్చిన తోటలలో కాయగూరలు, అపరాలు, వేరుశనగ సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చు. తొలకరిలో పచ్చిరొట్ట పైరులను సాగు చేయడం ద్వారా భూమిని సారవంతం చేయడంతోపాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని కూడా పెంచుకోవచ్చు. తరువాత అవసరాన్ని బట్టి నెలకు 1, 2 సార్లు దున్ని కలుపును నియంత్రించవచ్చు.

**పంట కోత :** నాటిన తరువాత నాలుగేళ్ళ వరకు వచ్చే పూతను తొలగించాలి. 5 లేక 6 వ సంవత్సరం నుండి చెట్లను కాపునకు వదలాలి ముదరని లేదా పక్వానికి రాని కాయలను కోయరాదు. సరిగా పండవు కాబట్టి పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే 3, 4 విడతలుగా కోయాలి.

**దిగుబడి :** 10 సం. వయస్సు గల చెట్లు సుమారు 1000 – 1500 కాయలు దిగుబడి. 25 సం. వయస్సు గల చెట్లు సుమారు 2000–2500 కాయల దిగుబడినిస్తాయి. 25 సం. పైబడిన చెట్లు 3000 కాయల దిగుబడినిస్తాయి.





**ఈ పండు చేసే మేలు :**

- సపోటాలో కాపర్, ఐరన్ ఉంటుంది.
- కేలరీలు చాలా ఎక్కువ.
- శరీరానికి తక్షణ శక్తినిస్తుంది.
- ఎర్రరక్తకణాల ఉత్పత్తికి దోహదపడుతుంది.
- హిమోగ్లోబిన్ 10% కంటే తక్కువ ఉన్న వారికి మేలు చేస్తుంది.
- పీచు పదార్థం ఉండడం వలన జీర్ణశక్తి సులభం.
- ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగం.
- నోటి క్యాన్సర్ నుంచి రక్షణ కల్పిస్తుంది.
- చర్మాన్ని కాంతివంతం చేస్తుంది.

డా. కె. ఉమామహేశ్వరి, డా. సి. మధుమతి,
చీనీ, నిమ్మ పరిశోధన స్థానం, పెట్లూరు

# అధిక సూక్ష్మ పోషకాల చేమ

ఆంధ్రప్రదేశ్‌లో చేమసాగు 1360 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. కోస్తా ప్రాంతాలలో ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో, రాయలసీమ ప్రాంతాలైన చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో సాగులో ఉంది. చేమ దుంపలో పిండి పదార్థం అధిక మోతాదులో వుండటమే కాకుండా థైమిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్, ఇనుము, భాస్వరం, జింక్, పొటాషియం, కాపర్ మరియు మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలు కూడా అధిక మోతాదులో ఉంటాయి. మిగిలిన దుంప పంటలతో పోల్చుకుంటే చేమ దుంపలలో మాంసకృత్తులు, ఖనిజ లవణాలు, ఇనుము శాతం అధికంగా ఉంటాయి.

**వాతావరణం :** ఇది ఉష్ణమండలం పంట. అలాగే ఎత్తైన ప్రాంతాలలో కూడా సాగు చేసుకోవడానికి అనువైన పంట. దీనికి భూమిలో తేమశాతం అధికంగా ఉండాలి. ఎక్కువ నీటిని కూడా తట్టుకోగలిగే స్వభావం కల పంట.

**నేలలు – నేల తయారీ :** చేమసాగుకు అన్నిరకాల నేలలు అనుకూలం. అయితే మురుగునీటి సదుపాయం గల సారవంతమైన నేలల్లో అధిక దిగుబడులను సాధించవచ్చు. వేసవిలో భూమిని 30–40 సెం.మీ లోతుగా దున్నాలి. తొలకరి వర్షాలకు 2–3 సార్లు గొర్రుతో మెత్తగా దుక్కి దున్ని చదును చేయాలి.

**నాటు సమయము :** మన రాష్ట్రంలో ప్రధానంగా ఈ పంట తేమతో కూడి 21–27 డిగ్రీల ఉష్ణోగ్రత మరియు 1000–2000 మి.మీ. వర్షపాతం గల ప్రాంతాలలో బాగా పెరుగుతుంది. వర్షాధారంగా సాగుచేసుకోవడానికి మే–జూన్ నెలల్లో నాటుకోవాలి. అలాగే నీటి వసతి క్రింద సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. కోస్తాజిల్లాల్లో మే, జూన్ నెలల్లోను, అలాగే డిసెంబరు నుండి మార్చి వరకు నాటుకోవచ్చు.


**విత్తన మోతాదు :** ఎకరానికి 300–400 కిలోల విత్తనం అవసరమవుతుంది. పిల్ల దుంపలైతే నేరుగా నాటుకోవాలి. అదే తల్లి దుంపలైతే కణుపుభాగం ఉండేటట్లుగా ముక్కలుగా చేసుకుని నాటుకోవచ్చు. పిల్లదుంపల కన్నా తల్లిదుంపలు విత్తనంగా వాడితే బాగా దుబ్బు చేసి మంచి దిగుబడి రావడానికి అవకాశం ఉంది.

**నాటుకునే విధానం :** స్వల్పకాలిక రకాలైతే 45×30 సెం.మీ. దూరంలోనూ, దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలను 45×45 సెం.మీ దూరంలోనూ నాటుకోవాలి. 30–40 గ్రా. బరువుగల ఆరోగ్య వంతమైన విత్తన దుంపలను 5–7 సెం.మీ. లోతులో నాటుకుని మట్టిని కప్పాలి. వరిగడ్డిని కప్పి మల్చింగ్ చేసినట్లయితే త్వరగా మొలక రావడానికి అవకాశం ఉంది.

**విత్తనశుద్ధి :** బాగా ఆరిన విత్తన దుంపలను 10 లీటర్ల నీటికి 50 గ్రా. కాపర్‌ఆక్సీక్లోరైడ్ మరియు 25 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపిన మందు ద్రావణంలో 15 ని.ల సేపు ముంచి తీసి నీడలో ఆరబెట్టిన వెంటనే నాటుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం :** ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువుతో పాటు 24 కిలోల భాస్వరం ఎరువును (150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో) వేయాలి. ఎకరానికి అవసరమైన 48 కిలోల నత్రజనిని (105 కిలోల యూరియా రూపంలో), 32 కిలోల పొటాష్‌ను, (55 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో) మూడు సమభాగాలుగా చేసి చేమ మొలకెత్తిన 30, 60, 90 రోజుల తరువాత మొక్కకు రెండువైపులా గుంతలలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి. ఎక్కువ నీటిని ఇచ్చినట్లయితే వేసిన ఎరువులు వృధా అయ్యే ప్రమాదం ఉంది.

**అంతరకృషి :** విత్తన దుంపలను నాటి మొదటి దఫా తడి పెట్టిన తరువాత నేల తేమగా ఉన్నప్పుడు ఎకరానికి 2.0 లీ. బుటాక్లోర్ లేదా 1.3 లీ. పెండి మిథాలిన్ 30%



| రకము | కాలపరిమితి (నెలలు) | దిగుబడి (ట/ఎకరాకు) | నాటుదూరం (సెం.మీ) |
|---|---|---|---|
| భావపురి (కె.సి.ఎస్-2) | 8 | 14 | 45 X 45 |
| భావపురి (కె.సి.ఎస్- 3) | 5-5.5 | 9.6 | 45 X 30 |
| శతముఖి | 6-7 | 00<br>14 | 45 X 30<br>45 X 45 |
| భావపురి (కె.సి.ఎస్- 3) | 5-5.5 | 9.6 | 45 X 30 |
| శతముఖి | 6-7 | 00 | 45 X 30 |

లేదా 200 మి.లీ. ఆక్సిఫ్లోరోఫిన్ 22.5% ఏదైనా ఒకదానిని 200 లీ.నీటిలో కలిపి భూమిపై పిచికారీ చేయాలి. 40-45 రోజుల తర్వాత పలుచగా మొలిచిన కలుపును కూలీలతో తీయించాలి. కలుపు తీసిన తర్వాత మట్టిని కొద్దిగా ఎగదోసినట్లైతే దుంపలు బలంగా ఊరడానికి అవకాశం ఉంది.

**నీటి యాజమాన్యం :** చేమకు నీటి తడులు ఎక్కువగా ఇవ్వవలసిన అవసరం ఉంది. అవసరాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా లేదా స్ప్రింక్లర్ల ద్వారా కూడా నీటిని ఇచ్చినట్లయితే మంచి దిగుబడులు రావడానికి అవకాశం ఉంది.



**అంతరపంటగా చేమసాగు :** చేమను వివిధ తోటపంటలలో ముఖ్యంగా నీటి వసతి ఉన్న ప్రాంతాలలో కొబ్బరి, అరటి, జీడిమామిడి అంతర పంటలగా సాగుచేసు కోవచ్చు.

## ధాతు లోపాలు - నివారణ చర్యలు

**పొటాష్ ధాతులోపం :** ముదురు ఆకులలో ఈ ధాతులోపము ఎక్కువగా కనిపిస్తుంది. పొటాష్ ధాతు లోపం సంభవించిన మొక్కలలో పెరుగుదల బాగా తగ్గిపోయి ఆకుల పరిమాణం కూడా బాగా తగ్గిపోతుంది. ఆకుల మధ్యభాగంలో నిర్ణీత ఆకారం లేని గోధుమరంగు మచ్చలు అలాగే ఆకుల అంచులన్నీ గోధుమ రంగులోకి మారిపోయి క్రమేణా ఎండిపోతాయి. తద్వారా దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశ మున్నది.

**నివారణ :** సిఫార్సు చేసిన మోతాదులో పొటాష్ ఎరువులు వేయాలి. అలాగే ధాతులోప లక్షణాలు కనపడినప్పుడు ఆకులపై సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రా. / లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఇనుప ధాతులోపము :** ఈ ధాతులోపం ప్రధానంగా లేత ఆకులలో కనిపిస్తుంది. ఆకుల ఈనెల మధ్యభాగం పసుపు రంగులో మారి ఆకులన్నీ పాలిపోయినట్లుగా కనిపిస్తాయి. తద్వారా దిగుబడులు తగ్గుతాయి.

**నివారణ :** దీని నివారణకు అన్నబేధి 5 గ్రా. 1 గ్రాము నిమ్మ ఉప్పుతో ఒక లీటరు నీటికి కలిపి వారం పదిరోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి.

**మాంగనీసు ధాతు లోపము :** మాంగనీసు ధాతు లోపం వల్ల లేత ఆకుల ఈనెల మధ్యభాగం పసుపుపచ్చగా మారి క్రమేణా ఆకు అంతా కూడా పసుపురంగులోకి మారి ఎండిపోతుంది. లోపం తీవ్రంగా ఉన్నట్లయితే మొక్కలన్నీ గిడసబారి దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

**నివారణ :** మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

**డా. కె. మమత, డా. జి. రామానందం, డా. కె. రవీంద్రకుమార్, డా. కిషోర్ కుమార్, డా. ఎ. స్నేహలతారాణి, డా. యం. విశ్వనాథ్, డా. వై.యస్.ఆర్.హెచ్.యు. - ఉద్యాన పరిశోధన స్థానం, కొవ్వూరు**



# వర్టికల్ ఫార్మింగ్



ప్రపంచ జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆహార అవసరాలు తీర్చాలంటే అభివృద్ధి చెందిన దేశాల్లో 70 శాతం మేర వర్ధమాన దేశాల్లో 100 శాతం మేర ఆహార ఉత్పత్తి పెరగాలి. సాగునేల, సాగు నీటి లభ్యత తగ్గి పోవడం మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన తగినంత దిగుబడిని పొందడం కష్టమవుతోంది. దీని వలన ప్రత్యామ్నాయ సాగు ఆవశ్యకత ఏర్పడింది. దీనిలో భాగమే నిట్టనిలువు వ్యవసాయం ( వర్టికల్ ఫార్మింగ్),

నిట్టనిలువు సేద్యంలో ఎత్తయిన భవనాలలో గదిలోపల నియంత్రిత వాతావరణంలో ట్రేలు లేదా వేలాడే మాద్యుళ్ళలో ఆహార పంటలు సాగు చేస్తారు. కాంతి, తేమ, ఉష్ణోగ్రత వంటి అంశాలను కృత్రిమ పద్ధతులలో ఏర్పాటు చేస్తారు అక్కడ వాతావరణం నియంత్రించవచ్చు. మొక్కలను క్రమపద్ధతిలో పొరలుగా ఒక దాని పై ఒకటి అమరుస్తారు ఈ వ్యవసాయం (వర్టికల్ ఫార్మింగ్) లో చాలావరకు హైడ్రో ఫోనిక్ లేదా ఏరో ఫోనిక్ విధానాలను అనుసరిస్తారు. హైడ్రో ఫోనిక్ విధానంలో మొక్క లను పోషకాలు పుష్కలంగా అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు తగు పాళ్ళలో కరిగి ఉన్న నీటి పాత్రలలో సాగు చేస్తారు అనగా పోషక ద్రావణాన్ని ఉపయో గిస్తారు ఏరో ఫోనిక్ విధానంలో పోషక ద్రావణ తుంపర్లను సూక్ష్మ బిందు వుల స్థాయి వెదజల్లుతారు.



ఈ విధానంలో అందుబాటులో ఉన్న స్థలాన్ని పూర్తిగా వినియోగించుకుంటూ నిట్టనిలువుగా, అడ్డంగా నీటి గొట్టాలను అంచెలంచెలుగా అమరుస్తారు వాటికీ రంధ్రాలు చేసి ఆ రంధ్రాలలో కొబ్బరి పీచుతో తయారుచేసే కోకోపిట్ ట్రేలను ఉంచి వాటిలో విత్తనాలు నాటుతారు.


విత్తనాలు మొలకెత్తిన తరువాత, నారు మొక్కలను ఒక్కో కప్పులో ఒక్కో మొక్క చొప్పున పైపులకు అమర్చిన కప్పులలోకి మారుస్తారు. మొక్కల వేర్లు కప్పులలోనుంచి పైపులు లేదా ఎస్.ఎఫ్.టి. ఛానల్స్ లోనికి పెరుగుతాయి. ఈ పైపులలో మొక్కలకు అవసరమైన పోషక ద్రావణం నిరంతరం నెమ్మదిగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నీరు మొత్తం పైపు అంతటా ప్రవహించి తిరిగి ట్యాంక్‌లోకి చేరుతుంది. తిరిగి అదేనీరు పైపులలోకి వెళ్ళేలా ఏర్పాటు చేస్తారు ఈ విధంగా పోషక ద్రావణం తిరిగి వినియోగించడం ద్వారా నీరు ఒక్క చుక్క కూడా వృధా కాకుండా వినియోగించబడుతుంది. ఇది నేల రహిత వ్యవసాయం కాబట్టి నేలలో లాగా వేళ్ళకు నీరు, పోషకాలను వెతుక్కునే శ్రమ ఉండదు. అనగా వేరు వ్యవస్థ పరిమాణము తక్కువుగా ఉండి, విస్తరణ తక్కువుగా ఉంటుంది. అందువలన వేరు విస్తరణకు వినియోగించే శక్తి తగ్గి, మొక్క పైభాగం పెరగడానికి ఎక్కువ శక్తి అందుబాటులో ఉంటుంది.

ఈ పద్ధతిలో కాంతిని నియంత్రించడానికి షేడ్ నెట్ ఏర్పాటు చేయవలసి ఉంటుంది. వ్యాపార సరళిలో వాతావరణ

నియంత్రణ గల గ్రీన్ హౌస్ మరియు పాలీహౌస్‌ను ఉపయోగిస్తారు. ఎండ పడని ప్రదేశమైతే తగినంత వెలుతురు కోసం యల్.ఇ.డి. లైట్స్‌ను వినియోగిస్తారు.

**ఈ పద్ధతిలో ప్రయోజనాలు అనేకం :**

- ఏడాది పొడవునా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు పండించవచ్చును.
- మొక్కలు 20 నుంచి 30 శాతం వేగంగా పెరుగుతాయి
- నియంత్రిత వాతావరణం వలన క్రిమి కీటకాల బెడద ఉండదు. ఫలితంగా క్రిమి సంహారకాలు హానికరమైన రసాయనాల వాడకం ఉండదు.
- ఈ విధానంలో దిగుబడులు మన నియంత్రణలో ఉంటాయి.
- నీటి వినియోగం 70-80 శాతం తగ్గుతుంది.
- సాధారణ వ్యవసాయంలో 20-25 ఎకరాలలో పండించే పంటను ఈ నిట్టనిలువు పద్ధతిలో ఒక ఎకరంలో పండించవచ్చు.
- పట్టణాలకు దగ్గరలోలోనే ఈ నిట్టనిలువు వ్యవసాయం చేపడితే తాజా ఉత్పత్తులు గంటల వ్యవధిలోనే వినియోగదారుడి వద్దకు చేరవేయవచ్చు.
- ఈ పద్ధతికి గ్రామీణ, పట్టణ ప్రాంత యువత శిక్షణ తీసుకుంటే మంచి ఉపాధి పొందవచ్చు.
- ఈ పద్ధతిలో పండించిన పంటలు సేంద్రీయ పంటలకంటే మిన్నగా నిలుస్తాయి
- దీనిలో ప్రయోజనాలతో పాటు ఇబ్బందులు కూడా కొన్ని ఉన్నాయి
- మౌలిక సదుపాయాలకోసం మొదట అధిక పెట్టుబడి అవసరముంటుంది. కొన్ని రకాల కూరగాయలు మాత్రమే ఈ విధానంలో పరిమితం.



**జె. వెంకటరావు**
**ఎ.డి.ఏ., వ్యవసాయ కమీషనర్ కార్యాలయం, గుంటూరు**






# డ్రాగన్ ఫ్రూట్ + శ్రీగంధం సాగు

వ్యవసాయం మీద ఆసక్తి, అనురక్తి తో 20 ఏళ్ల వృత్తి జీవితానికి స్వస్తి పలికారు ఓ మహిళ. సంప్రదాయ పంటల సాగు కాకుండా ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు, బాపట్ల జిల్లా వలపర్రు గ్రామానికి చెందిన దుర్గాభవాని. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఈ పంటలో ఇప్పుడు అంతర పంటగా శ్రీగంధం సాగు చేస్తున్నారు. ఒక్క బోరు సాయంతోనే నాలుగు ఎకరాల్లో మహారాష్ట్ర నుంచి ఒక్కో డ్రాగన్ ఫ్రూట్ మొక్క రూ.60 వంతున తెచ్చి నాటారు. 9 అడుగుల సిమెంట్ స్థంభాలు, తీగలకు పెట్టుబడి పెట్టారు. బిందు సేద్యం ఏర్పాటు చేసుకున్నారు. రైతు భరోసా కేంద్రంలో సాగు విధానాలు నేర్చుకున్నారు. ఒక్కొక్క స్థంభానికి ఉన్న మొక్కలకు లీటరున్నర నీరు సరిపోతుంది. మొక్కలు నాటిన 8 నెలలకే కాపు వచ్చింది. మే నుంచి నవంబర్ వరకు కాయలు కాస్తాయి. డిసెంబర్ తర్వాత కాపు ఆగిపోతుంది. ఎరువులు, కలుపు తీత, ఇతర నిర్వహణ ఖర్చులకు ఎకరానికి రూ. లక్ష వెచ్చించారు. కాపు వచ్చిన తర్వాత ఎకరానికి ఏడు టన్నుల దిగుబడి వచ్చింది. ఒక్కొక్క కాయ 200 నుంచి 300 గ్రాముల బరువు ఉంటుంది. కిలో పండ్లు రూ. 110 వంతున ధర పలుకుతోంది. పెద్దగా తెగుళ్లు వంటివి రాలేదని మహిళా రైతు దుర్గాభవాని చెబుతున్నారు.

**పంటలకు ఉద్యానశాఖ రాయితీలు :** ఉద్యాన శాఖ హెక్టారుకు రూ. 30 వేల వంతున గరిష్ఠంగా పది ఎకరాల వరకు రాయితీ ఇస్తోంది. కనీసం 20 ఏళ్ల వరకు కాపు వస్తుందని ఉద్యానశాఖాధికారి హనుమా నాయక్ చెప్పారు.

**అంతర పంటతో రక్ష, అదనపు ఆదాయం :** డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు వేసవిలో ఎండ నుంచి రక్షణకు షేడ్ నెట్ ఉపయోగించారు. అయితే గాలికి చిరిగి, నిర్వహణ కష్టమైపోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఉద్యాన శాఖ సూచనల మేరకు దీర్ఘకాలపు పంటగా శ్రీగంధం మొక్కలు తెచ్చి నాటారు. ఇవి పెరిగి నీడనివ్వడమే కాకుండా కొన్నాళ్ళ తర[illegible]

[illegible] సౌజన్యంతో
**యూట్యూబ్ వీడియో లింకు కొరకు**
https://youtu.be/CJcaVbhc31A



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయం

1. రైతు పేరు: వెంకటరమణ, గ్రామం: కొలవలి, మండలం: ముద్దనూరు, జిల్లా: వై.యస్.ఆర్., ఫోన్ నెంబర్: **9908551681.**

**ప్ర. మినుము పంటలో ఆకులు పసుపు రంగులోకి మారు తున్నాయి. ఏమి పిచికారీ చేయాలో తెలుపగలరు?**

జ. మినుములో పల్లాకు తెగులును వ్యాప్తి చేసే తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 2 గ్రా. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ.చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున అమర్చుకోవాలి.

2. రైతు పేరు: బాలచంద్ర, గ్రామం: దువ్వూరు, మండలం: దువ్వూరు, జిల్లా: వై.యస్.ఆర్ కడప, ఫోన్ నెంబర్: 8341166316

**ప్ర. నువ్వుల పంటలో ఆకుల అడుగుభాగంలో పచ్చదోమలు ఆశించినవి. నివారణ తెలపండి?**

జ. నువ్వుల పంటలో పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.3 మి.లీ. లేదా థయో క్లోప్రిడ్ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3. రైతు పేరు : నరసింహులు, గ్రామం : పెండేకల్, మండలం : కొసిగి, జిల్లా :కర్నూలు, ఫోన్ నెం. : 7660997401

**ప్ర. వేరుశనగలో మొక్కలు గిడసబారి, ఆకులు చిన్నవిగా ఉండి, ఈనెలు తప్ప మిగిలిన భాగం పసుపు రంగు లోకి మారుతున్నవి. నివారణ తెలపండి?**

జ. వేరుశనగలో జింక్ ధాతు లోపం సవరణకు జింక్ సల్ఫేట్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

4. రైతు పేరు: శివయ్య, గ్రామం: తాళ్ళపల్లి, మండలం: మాచర్ల, జిల్లా: పల్నాడు, ఫోన్ నెంబర్ : 6300808591

**ప్ర. కంది పంటలో ఆకుల అడుగు భాగంలో తామర పురుగులు ఆశించినవి. నివారణ తెలపండి?**

జ. కంది పంటలో తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5. రైతు పేరు: మురళీ, గ్రామం : అంతర్ల, మండలం: పాత పట్నం, జిల్లా: శ్రీకాకుళం, ఫోన్ నెం. : 9182530734

**ప్ర. ప్రొద్దుతిరుగుడు వేయాలని అనుకుంటున్నాను, విత్తనశుద్ధి గురించి తెలుపగలరు?**

జ. ప్రొద్దుతిరుగుడులో నెక్రోసిస్ వైరస్ తెగులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ 4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రా.తో విత్తనశుద్ధి చేసుకోవాలి. అలాగే ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కార్బండిజమ్ + మాంకోజెబ్ మిశ్రమం 2 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

6. రైతు పేరు: శ్రీనివాసరావు, గ్రామం: కోరుమామిడి, మండలం : నిడదవోలు, జిల్లా : తూర్పు గోదావరి, ఫోన్ నెంబరు 8074206443.

**ప్ర. చెఱకు పంటలో కాండం తొలుచు పురుగులు ఆశించినవి. నివారణ తెలపండి?**

జ. చెఱకు పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

7. రైతు పేరు: బుక్కా నగేష్, గ్రామం: బుగ్గనిపల్లె, మండలం: బేతంచెర్ల, జిల్లా: నంద్యాల, ఫోన్ నెం.: 7989012914.

**ప్ర. జొన్నలో కంకుల నుండి తెల్లని తియ్యటి జిగురు వంటి ద్రవం కారుతుంది. నివారణ తెలపండి?**

జ. జొన్నలో బంక కారు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 0.5 మి.లీ. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో 2 సార్లు పూత దశలో పిచికారీ చేసుకోవాలి.

8. రైతు పేరు: చంద్ర ఓబుల్ రెడ్డి, గ్రామం: రంపతాడు, మండలం: పెండ్లిమర్రి, జిల్లా: వై.యస్.ఆర్ కడప, ఫోన్ నెంబర్: **9052865924**

ప్ర. **నువ్వుల పంటలో ఆకులపై బూడిద వంటి పదార్థం ఏర్పడుతుంది. నివారణ తెలపండి?**

జ. నువ్వుల పంటలో బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

## ఉద్యానశాఖ

1. రైతు పేరు: ప్రతాప్, గ్రామం: యరజర్ల, మండలం: ఒంగోలు, జిల్లా: ప్రకాశం, ఫోన్ నెంబర్: **7780701312.**

ప్ర. **నిమ్మలో ఆకులపై పొలుసు పురుగులు ఆశించినవి. నివారణ తెలపండి?**

జ. నిమ్మలో పొలుసు పురుగు నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

2. రైతు పేరు: మాలిని, గ్రామం: మామడుగు, మండలం: గంగవరం, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెంబర్ : **6301686133**

ప్ర. **బంతిలో ఆకులు ఎండిపోయి రాలిపోతున్నాయి. నివారణ తెలపండి?**

జ. బంతిలో ఆకు ఎండు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3. రైతు పేరు: మోహన్, గ్రామం: బుట్టాయగూడెం, మండలం: బుట్టాయగూడెం, జిల్లా: పశ్చిమ గోదావరి, ఫోన్ నెం: **9182133028**

ప్ర. **10 సంవత్సరాల ఆయిల్ పామ్ తోటలో చెట్లకు ఎరువులు ఎంత మోతాదులో వేసుకోవాలో తెలియజేయగలరు?**

జ. ఆయిల్ పామ్ తోట నాటిన మూడవ సంవత్సరం నుండి ఒక్కొక్క చెట్టుకు యూరియా 2.6 కేజీలు, యస్.యస్.పి. 3.75 కేజీలు, యం.ఓ.పి 2 కేజీలు, మెగ్నీషియం సల్ఫేట్ 0.5 కేజీలు, బోరాన్ 100 గ్రా.ను మూడు నెలలకు ఒకసారి వేసుకోవాలి.

4. రైతు పేరు: యస్. సూర్యనారాయణ రెడ్డి, గ్రామం: చాపట్ల, మండలం: రాప్తాడు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెం: **8790849075.**

ప్ర. **మామిడిలో గొంగళి పురుగులు చెట్ల కొమ్మల నుండి వ్రేలాడుతూ కనిపిస్తున్నాయి. నివారణకు ఏమి పిచికారీ చేయాలి?**

జ. మామిడిలో గొంగళి పురుగుల నివారణకు లామ్డాసైహాలోత్రిన్ 0.5 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5. రైతుపేరు: కె.సతీష్, గ్రామం: సనపల్లిలంక, మండలం: అయినవిల్లి, జిల్లా: తూర్పుగోదావరి, ఫోన్: **9533656217.**

ప్ర. **బీరలో ఆకుల ఈనెల మధ్య మందంగా చారలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ. బీరలో వెర్రి తెగులును వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

6. రైతు పేరు: చెన్నయ్య, గ్రామం: ఆకులనారాయణపల్లి, మండలం: శ్రీ అవదూత కాసినాయన, జిల్లా: కడప ఫోన్ నెం: **9441768843**

ప్ర. **అరటిలో మొక్కలు వడలినట్లు ఉండి, ఆకుల అంచుల వెంబడి నల్లగా మారి క్రమేపి ఎండిపోతున్నాయి. ఎలా నివారించుకోవాలో చెప్పగలరు?**

జ. నులిపురుగులు సోకిన అరటి తోటల్లో మొక్కకు 25 నుండి 40 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు మొక్క మొదలు వద్ద 10 సెం.మీ. లోతులో వేసి మట్టితో కప్పి తేలికగా నీరు పెట్టాలి.

7. రైతు పేరు: రాముడు, గ్రామం: పెద్దనల్తూర్, మండలం: గోనెగండ్ల, జిల్లా: కర్నూలు ఫోన్ నెం: **8688289346**

ప్ర. **బీట్ రూట్‌లో లేత ఆకులు గోధుమ రంగులోకి మారి ఎండిపోతున్నాయి. వేర్లు మీద నలుపు మచ్చలు ఏర్పడు తున్నాయి. ఏమి చేయాలో తెలుపగలరు?**

జ. బీట్ రూట్ లో బోరాన్ ధాతు లోపం వలన వచ్చే బ్రౌన్‌హార్ట్ ఎండు తెగులు నివారణకు కాపర్ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి కలిపి మొక్క మొదల్లో వేసుకోవాలి. తరువాత కార్బండిజమ్ 1 గ్రా.ను పిచికారీ చేసిన వారం రోజుల తరువాత బోరాక్స్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

8. రైతుపేరు: సిద్దేష్ గ్రామం: గునిమోరుభాగల్, మండలం: గుడిబండ, జిల్లా: శ్రీ సత్యసాయి ఫోన్ నెం: **7569178993**

ప్ర. **వక్క 45 రోజుల తోట, ఎరువులు ఏ విధంగా వేసుకోవాలో తెలపండి?**

జ. వక్కలో ఎరువులు యూరియా 110 గ్రా., సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 125 గ్రా., మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 40 గ్రా. మరియు సంవత్సరానికి 5-7 కిలోల పచ్చి ఆకు మరియు కంపోస్టు అదనంగా గుంత తీసి ఒక్కొక్క చెట్టుకు వేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154



1 రైతుపేరు: డి.ప్రదీప్ కుమారరెడ్డి, గ్రామం : వొంగిమల్ల, మండలం: వీరబెల్లి, జిల్లా: అన్నమయ్య, ఫోన్ నెంబర్: 9440356400

ప్ర: **వరిలో ఆకుతినే గొంగళి పురుగులు ఆశించినవి. నివారణ తెలపండి ?**

జ: వరిలో ఆకుతినే గొంగళి పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.



2. రైతుపేరు: ఎల్. యలమందారెడ్డి, గ్రామం : లక్ష్మీపురం, మండలం: కలిగిరి, జిల్లా : నెల్లూరు, ఫోన్ నెంబర్: 8297887309

ప్ర: **వంగలో కాయలు వంకర తిరిగిపోతున్నాయి, నివారణ తెలపండి ?**

జ: వంగలో కాయ తొలుచు పురుగు నివారణకు థయోక్లోప్రిడ్ 1మి.లీ. లేదా క్లోరాంత్ర నిలిప్రోల్ 0.3 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధితో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి.



3. రైతుపేరు: కొండ స్వామి, గ్రామం : రాజగోపాలపురం, మండలం: సత్యవేడు జిల్లా : తిరుపతి, ఫోన్ నెంబర్: 9652674393

ప్ర: **వేరుశనగ మొక్కలు లేత ఆకుపచ్చ రంగులోకి మారి పసుపుబారుతున్నాయి, నివారణ తెలపండి?**

జ: వేరుశనగలో నత్రజని పోషక లోపం సవరణకు 19:19:19, 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.



4. రైతుపేరు: వెంకటేష్ గ్రామం : పోలకల్, మండలం: సి.బెళగల్, జిల్లా : కర్నూలు ఫోన్ నెంబర్: 9642792418

ప్ర: **బీన్స్ పంటలో ఆకులపై మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలపండి ?**

జ: బీన్స్ పంటలో ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా డైఫెన్ కొనజోల్ 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7-14 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయవలెను.



5. రైతుపేరు: కర్లపూడి తేజ గ్రామం : కోపల్లె మండలం: తెనాలి జిల్లా : గుంటూరు ఫోన్ నెంబర్:9493924140

ప్ర: **గులాబిలో ఆకులపై నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలపండి ?**

జ: గులాబిలో నల్లమచ్చ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా కార్బండిజమ్ 2 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ.చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి

6. రైతుపేరు: హరి హోట్టేల, గ్రామం : గడేహోతూర్, మండలం: వజ్రకరూరు జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్: 7730020031



ప్ర: **కొత్తిమీరలో ఆకులు మాడి ఎండిపోతున్నాయి, నివారణ తెలపండి ?**

జ: కొత్తిమీరలో ఆల్టర్నేరియా ఆకుమాడు తెగులు నివారణకు కార్బండిజమ్ + మాంకోజెబ్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కలు పూర్తిగా తడిచేటట్లుగా పిచికారీ చేసుకోవాలి.



7. రైతుపేరు: రామమోహన్, గ్రామం : చిన్నమండెం, మండలం: చిన్నమండెం జిల్లా : అన్నమయ్య, ఫోన్ నెంబర్: 7780686605

ప్ర: **కొబ్బరి తోటలో ఇరియోఫిడ్ నల్లి ఆశించినది, నివారణ తెలపండి ?**

జ: కొబ్బరి తోటలో ఇరియోఫిడ్ నల్లి నివారణకు ముందుగా నల్లి ఆశించిన కాయలను కోసి కాల్చి నాశనం చేసుకోవాలి. అజాడిరక్టిన్ (10000 పి.పి.యం) 5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి గెలలపై పిచికారీ చేసుకోవాలి. 5-10 కిలోల వేపపిండి 3.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ను ఒక్కొక్క చెట్టుకు రింగులు/ పళ్ళెంలో వేసుకోవాలి. సారవంతమైన భూముల్లో అంతర పంటగా అరటి, కంద, కోకో, పసుపు లేదా కూరగాయలు పండించుట ద్వారా నల్లి తాకిడిని తగ్గించుకోవచ్చు.

8. రైతుపేరు: మహిపాల్ రెడ్డి, గ్రామం : రంగాపురం, మండలం: రెడ్డిగూడెం, జిల్లా : ఎన్టీఆర్, ఫోన్ నెంబర్: 9963228387



ప్ర: **మినుములో ఆకుల కాడలు మరియు ఆకులు పెద్దవిగా, ఉబ్బెత్తుగా అయ్యి ముడతలు పడుతున్నాయి, నివారణ తెలుపగలరు?**

జ: మినుములో సీతాఫలం తెగులును వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయవలెను. వారం వ్యవధిలో మల్టీ –కె 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయవలెను.



9. రైతుపేరు : సత్యన్నారాయణ, గ్రామం : సబ్బవరం, మండలం: సబ్బవరం, జిల్లా : విశాఖపట్నం, ఫోన్ నెంబర్: 9948683855

ప్ర: **బెండ ఆకులపై తెల్లని చారలు ఏర్పడుతున్నాయి, నివారణ చెప్పండి?**

జ: బెండలో పాముపొడ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజొయేట్ 0.4 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయవలెను.



10. రైతుపేరు: గవిని నాగరాజు గ్రామం : గవినివారి పాలెం మండలం: చీరాల జిల్లా : బాపట్ల, ఫోన్ నెంబర్: 9000930753

ప్ర: **పుచ్చలో ఆకులపై తెల్లటి బూజు పదార్థం ఏర్పడుతుంది, నివారణ తెలపండి?**

జ: పుచ్చలో బూజు తెగులు నివారణకు మాంకోజెబ్ ◘ మెటలాక్సిల్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

1. రైతుపేరు: బంటు ధనబాబు, గ్రామం : పల్లంకుర్రు, మండలం: కాట్రేనికోన, జిల్లా: కోనసీమ ఫోన్ నెంబర్ 9014398450

ప్ర. వరిలో ఆకులు పసుపు రంగులోకి మారి క్రిందకు వాలి, ఎండిపోతున్నాయి, నివారణ చెప్పండి?



జ. వరిలో కాండం కుళ్ళు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీ. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

2. రైతు పేరు: ఆంజనేయులు, గ్రామం: పెద్దమంతూరు మండలం: రొద్దం, జిల్లా: శ్రీ సత్యసాయి, ఫోన్ నెంబర్: **8317697301**

ప్ర. మొక్కజొన్నలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, మొక్కలు చనిపోయినట్లు కన్పిస్తున్నాయి, నివారణ తెలపండి?

జ. మొక్కజొన్నలో టర్సికమ్ ఎండు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

3. రైతు పేరు: కొండలరావు, గ్రామం: కృష్ణాపురం, మండలం: తొండంగి, జిల్లా: కాకినాడ, ఫోన్: **8106659832**.

ప్ర. మినుములో ఆకులపై తెల్లటి బూడిద వంటి పదార్థం ఏర్పడుతుంది, ఏమి పిచికారి చేసుకోవాలో తెలుపగలరు?




జ. మినుములో బూడిద తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండిజమ్ 1 గ్రా.చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

4. రైతు పేరు: శివ కోటిరెడ్డి, గ్రామం: పెండ్లిమర్రి, మండలం: పెండ్లిమర్రి, జిల్లా: కడప, ఫోన్ నెంబర్: **9492881131**

ప్ర. దోస పంట వేయాలని అనుకుంటున్నాను, ఏ సమయంలో విత్తుకోవచ్చో తెలుపగలరు?

జ. దోస పంటను జనవరి 15 నుంచి ఫిబ్రవరి నెల వరకు విత్తుకోవచ్చు.

5. రైతు పేరు: మహిపాల్ రెడ్డి, గ్రామం: రంగాపురం, మండలం: రెడ్డిగూడెం జిల్లా: ఎన్.టి.ఆర్, ఫోన్ నెంబర్: **9963228387**

ప్ర. మామిడిలో లేత ఆకులు చిన్నవిగా ఉండి రాలి పోతున్నాయి, నివారణ తెలపండి?

జ. మామిడిలో తామర పురుగు నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

6. రైతు పేరు : నాగరాజు, గ్రామం: వెంకటాపురం, మండలం: కమలాపురం, జిల్లా: వై.యస్.ఆర్., ఫోన్ నెంబర్ :**8978754509**

ప్ర. చీనీలో చెట్లు ఎండిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ: చీనీలో వేరుకుళ్ళు తెగులు నివారణకు 1% బోర్డో మిశ్రమంను. వారం రోజుల తరువాత కార్బండిజమ్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పాదుల్లో పోసుకోవాలి.

7. రైతు పేరు: కిరణ్ కుమార్, గ్రామం: జరుబులవారి పాలెం, మండలం: కారంచేడు, జిల్లా: బాపట్ల ఫోన్ నెంబర్: 9494023930

ప్ర. శనగ పంటలో మొక్కలు ఎండిపోతున్నాయి, నివారణ చెప్పండి?



జ. శనగ పంటలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

8. రైతు పేరు: జనార్ధన్‌రావు, గ్రామం: కె.కొత్తూరు, మండలం: టెక్కలి, జిల్లా: శ్రీకాకుళం ఫోన్ నెం: **9618710804**

ప్ర. బీరలో ఆకు, కాయ తొలుచు పురుగులు ఆశించినవి. నివారణ తెలపండి?

జ. బీరలో ఆకు, కాయ తొలుచు పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.




# రైతుల స్పందన

**సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు** మిరప పూతలో తామర పురుగు నివారణకు బవేరియా బాసియానా 1 లీటరు ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది.

**వెంకట లక్ష్మి, కండ్లగుంట గ్రా., నాగులుప్పలపాడు మం, ప్రకాశం జిల్లా ఫోన్: 7075620485.**

**రైదర్ రాయేలు, చిత్తూరు గ్రా., చిత్తూరు మం., చిత్తూరు జిల్లా, ఫోన్ నెం. : 9505358653.**

**సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు** మల్లె తోటలో ఇరియోఫిడ్ నల్లి నివారణకు అబామేక్టిన్ 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. నల్లి ఉధృతి చాలా వరకు తగ్గింది. ధన్యవాదాలు.

**సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు** నిమ్మలో గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసాను. తెగులు లక్షణాలు మరలా కనబడలేదు. తోట బాగుంది. ధన్యవాదాలు.

**గోపాలకృష్ణ, ఆర్.రామాపురం గ్రా., సిద్దాపురం మం., నెల్లూరు జిల్లా ఫోన్ 9493526738.**

**వెంకట రమణ, అయ్యవారిపల్లి గ్రా., సీతారామపురం మం., నెల్లూరు జిల్లా, ఫోన్ 7386857005.**

**సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు** ప్రొద్దుతిరుగుడులో రసంపీల్చే పురుగు నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. పంట బాగుంది.


**సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు** శనగ పంటలో తుప్పు తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పంట బాగుంది. ధన్యవాదాలు.

**జైపాల్‌రెడ్డి కట్టక్రిందపల్లి గ్రా., పామూరు మం, ప్రకాశం జిల్లా, ఫోన్ :8340988797.**

**దుమ్మని చిన్నయ్య, సింగరపల్లె గ్రా., బెస్తవారిపేట మం., ప్రకాశం జిల్లా, ఫోన్ 8096898131.**

**సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు** టమాటాలో తెల్లదోమ నివారణకు థయోమిథాక్సామ్ 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పంట బాగుంది. ధన్యవాదాలు.

# ఫిబ్రవరి నెల విజేతలు



**ఎస్. ప్రసాదరావు**
డి.ఎ.ఓ., తిరుపతి

2023 సంవత్సరం ఫిబ్రవరి నెలకు గాను రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తమ పని తీరుతో ప్రథమంగా నిలిచిన తిరుపతి జిల్లా వ్యవసాయాధికారి, ఎస్. ప్రసాదరావు, డా. వై.ఎస్.ఆర్. అగ్రి ల్యాబ్స్‌లో, వై.ఎస్.ఆర్. జిల్లా కమలాపురం ల్యాబ్ అధికారులు ఎ.డి.ఎ.-ఎ.వి. నరసింహారెడ్డి, ఏ.ఓ.-ఎం. సరస్వతి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.



**ఎ.వి. నరసింహారెడ్డి**
ఎ.డి.ఎ., కమలాపురం ల్యాబ్



**ఎం. సరస్వతి**
ఏ.ఓ., కమలాపురం ల్యాబ్

# ఉత్తమ సేవలందిస్తున్న ఆర్.బి.కె. సిబ్బంది



**జి. శరత్‌పవార్**
మోతుగూడెం, చింతూరు మం., ఎ.ఎస్.ఆర్. జిల్లా



**వి. సత్యరవిరాజ్**
అరబ్బుపాలెం, మునగపాక మం., అనకాపల్లి జిల్లా



**బానావత్ రోజా**
కాలువపల్లి, బెళుగుప్ప మం., అనంతపురం జిల్లా



**ఎస్. బావాజాన్**
బూర్లపల్లె, పి.టి.ఎం మం., అన్నమయ్య జిల్లా



**కె. కీర్తన**
విజయనగర్ కాలనీ, చీరాల మం., బాపట్ల జిల్లా



**అస్మిన్**
పైపాళ్యం, కుప్పం మం., చిత్తూరు జిల్లా



**ఎం. ఝాన్సీప్రతాప్**
చెంఘిజ్‌ఖాన్‌పేట, యడ్లపాడు మం., పల్నాడు జిల్లా



**ఎస్. అరుణకుమారి**
మండరాడ, సంతకవిటి మం., విజయనగరం జిల్లా



**జి. రమేష్**
బూపాలపట్నం-2, రాజానగరం, మం., తూర్పుగోదావరి జిల్లా



**కె. దివ్య**
దొరమామిడి-2, బుట్టాయి గూడెం మం., ఏలూరు జిల్లా



**ఎన్. సురేష్‌బాబు**
దండమూడి, పొన్నూరు మం., గుంటూరు జిల్లా



**యాదగిరి కిషోర్**
పైడికొండ-2, తొండంగి మం., కాకినాడ జిల్లా



**వి. భవాని**
కొండపావులూరు, గన్నవరం మం., కృష్ణా జిల్లా



**తస్లీమ్**
హోలగుండ, చిన్నహైత మం., కర్నూలు జిల్లా



**గీత మౌనిక**
వామకుంట్ల, తిరువూరు మం., యన్.టి.ఆర్. జిల్లా



**కె. పట్నాయక్**
సుంకేశుల, అవుకు మం., నంద్యాల జిల్లా



**కె. లావణ్య**
కొంచె, వీరఘట్టం మం., పార్వతీపురం మన్యం జిల్లా



**జి. వెంకట హైమావతి**
కొండేపల్లి, మార్కాపురం మం., ప్రకాశం జిల్లా



**సుమియబాను**
కొండూరు, లేపాక్షి మం., శ్రీసత్యసాయి జిల్లా



**పి. శ్రావణి**
పడమటిపాలెం, సంగం మం., ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా



**సుధారాణి**
గుప్పిడిపేట, పోలాకి మం., శ్రీకాకుళం జిల్లా



**వై. సుభాషిణి**
కుక్కటంబాకం, బి.ఎన్. కండ్రిగ మం., తిరుపతి జిల్లా



**మేడపాటి సలోమి**
పెదగదిలి, పెందుర్తి మం., విశాఖపట్టణం జిల్లా



**కృష్ణ గంగ**
మార్టేరు, పెనుమంట్ర మం., పశ్చిమ గోదావరి జిల్లా



**ఎ. అభిలాష్‌రెడ్డి**
అలవాలపాడు, వేంపల్లె మం., వై.ఎస్.ఆర్. జిల్లా



**జి. సాయి ప్రియ**
అంగర-1, కపిలేశ్వరపురం మం., కోనసీమ జిల్లా

# మారుకా మచ్చల పురుగు






పూత దశలో



కాయ దశలో



కాయను తొలుస్తూ...

**నష్టం:**

- లేత ఆకులు, పూ మొగ్గలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది.
- పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది.
- కాయలు తయారయ్యేటప్పుడు పిందెలు, కాయలను గూడుగా కట్టి కాయలకు రంధ్రం చేసి లోపలి గింజలను తింటుంది.

**నివారణ:**

- **పైరు పూత దశకు రాక ముందు:** 5% వేప గింజల కషాయం లేదా 5.0 మి.లీ. వేప నూనెను 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **మొగ్గ, పూత దశలో:** అక్కడక్కడా కొన్ని పూ మొగ్గలను తెరిచి పిల్ల పురుగులు కనిపించినట్లయితే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **పంటలో గూళ్ళు గమనించినప్పుడు :** ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు:** స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.